Happy Work Anniversary.
1st Year

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152


Good for Health
Best for Readers

సంపుటి : 2 సంచిక : 48 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 18 ఫిబ్రవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 47 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 18 February 2025 PAGES : 8 PRICE : 5/-

### జనసేన ఆవిర్భావ వేడుకలపై
# కీలక నిర్ణయం

మార్చి 14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకలు
పవన్ ప్రతిపాదన మేరకు నిర్ణయం
జనసేన ఘన విజయం తర్వాత తొలి ఆవార్భావ వేడుకలు



జనసేన ఆవిర్భావ వేడుకలకు సంబంధించి ఆ పార్టీ కీలక ప్రకటన చేసింది. మార్చి 14న జనసేన ఆవిర్భావ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలను జనసేనాని పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురంలో నిర్వహించాలని జనసేన నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల్లో జనసేన 100 శాతం స్ట్రైక్ రేట్ తో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వ ఏర్పాటులో జనసేన కీలకపాత్రను పోషించింది. ఘన విజయం తర్వాత మొదటి ఆవిర్భావ సభ కావడంతో... సభకు భారీ ఏర్పాట్లు చేయనున్నారు. పవన్ కల్యాణ్ ప్రతిపాదన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.



## ప్రత్యేక హోల్డింగ్ జోన్లను ఏర్పాటు

- ఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట ఘటన... రైల్వే శాఖ కీలక నిర్ణయం
- అత్యధిక రద్దీ కలిగిన 60 స్టేషన్లలో శాశ్వత హోల్డింగ్ జోన్ల ఏర్పాటు
- స్టేషన్లలో రద్దీ నియంత్రణకు ఏఐని వినియోగించుకోనున్న రైల్వే శాఖ

### దేవాలయాలు ఆధ్మాత్మిక కేంద్రాలే కాదు...
# ప్రధాన ఆదాయ వనరులు

దేశానికి సరైన సమయంలో సరైన నేత ప్రధానిగా ఉన్నారు
తిరుపతిలో సీఎం చంద్రబాబు
తిరుపతిలో ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో ప్రారంభించిన సీఎం చంద్రబాబు
టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో మనం చాలా ముందున్నామని వ్యాఖ్యలు



**తిరుపతి**

తిరుపతిలో అంతర్జాతీయ దేవాలయాల సదస్సు (ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో)ను ప్రారంభించిన అనంతరం సీఎం చంద్రబాబు ప్రసంగించారు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు ప్రధానమంత్రిగా ఉన్నారని చంద్రబాబు కొనియాడారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో మనం చాలా ముందున్నామని, దేశంలో యువత ఎక్కువగా ఉండడం మనకు మరో అదృష్టమని అన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో ఒకటి లేదా రెండో స్థానానికి ఎదగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. టెక్నాలజీ సాయంతో ఆలయాల్లో కార్యక్రమాలు సులభతరం అవుతున్నాయని అన్నారు. దేవుడి పేరిట సమాజానికి సేవ చేసేందుకు ఎంతో మంది ముందుకు వస్తున్నారని తెలిపారు. దేవుడికి సేవ చేయడం అన్నిటి కంటే ఎంతో గొప్పది అని పేర్కొన్నారు. తిరుమల బాలాజీ అంటే కోట్ల మంది భక్తులకు నమ్మకం, ప్రగాఢ విశ్వాసం అని వివరించారు. ఏపీలోని దేవాలయాల్లో మౌలిక వసతులు పెంచామని వెల్లడించారు. ఏడు నెలల్లోనే దేవాలయాలకు రూ.134 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. రాష్ట్రంలోని అర్చకులకు వేతనాలు, వేద పాఠశాలలకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రముఖ ఆలయాలకు కమిటీలు ఏర్పాటు చేసి కార్యక్రమాల నిర్వహణ - మిగతా3లో

## కుంభమేళాలో కొనసాగుతున్న భక్తుల తాకిడి

52 కోట్ల మంది పుణ్య స్నానాలు
ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహాకుంభమేళాకు రికార్డుస్థాయిలో భక్తులు
జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా
ఈ నెల 26 వరకు కొనసాగనున్న ఆధ్యాత్మిక కార్యక్రమం



### మహాకుంభమేళాలో మంత్రి లోకేష్
## దంపతుల పుణ్యస్నానాలు



**అమరావతి**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో కోట్లాది మంది భక్తులు పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధాని మోదీ నుంచి వీఐపీలు, ప్రముఖులు, సామాన్య ప్రజలు ఇలా ఎంతో మంది పుణ్యస్నానాలు చేశారు. తాజాగా ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ దంపతులు కూడా మహాకుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణి సంగమం షాహి స్నానఘట్టంలో సాంప్రదాయబద్ధంగా స్నానాన్ని ఆచరించి గంగాదేవికి పూజలు చేసి, హారతులు ఇచ్చారు లోకేష్ దంపతులు. ఆపై పితృదేవతలను స్మరించుకుంటూ బ్రాహ్మణులకు వస్త్రదానం చేశారు. పూర్వీకులకు మోక్షమార్గాన్ని ప్రసాదించాలంటూ గంగాదేవిని ప్రార్థించారు. కుంభమేళా ప్రాంగణంలో ప్రతిధ్వనించే కీర్తనలు, నదీ సంగమం వద్ద - మిగతా3లో



### సంకెళ్లతో మోదీ కార్టూన్..
## తమిళ వెబ్ పత్రికపై కేంద్రం వేటు

- భారతీయ వలసదారులకు సంకెళ్లు వేసి పంపుతున్న అమెరికా
- ట్రంప్ ముందు మోదీ సంకెళ్లతో కూర్చున్నట్టు కార్టూన్ ప్రచురించిన 'వికటన్'
- కేంద్ర సమాచార మంత్రికి ఫిర్యాదు చేసిన తమిళనాడు బీజేపీ చీఫ్

### ఇది ప్రజాస్వామ్య
# ప్రభుత్వమేనా?

వల్లభనేని వంశీకు వైఎస్ జగన్ పరామర్శ
టీడీపీ కార్యకర్తలు వెళ్లి వారిని బెదిరించి, భయపెట్టడం కరెక్టేనా?
సత్యానికి కట్టుబడి నిజాలు చెప్పినందుకు దళిత యువకుడ్ని పోలీసులను పంపించి మరీ వేధించడం ఎంతవరకు కరెక్ట్?

**తాడేపల్లి**

రేపు (మంగళవారం) వల్లభనేని వంశీని వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించనున్నారు. కూటమి నేతల అక్రమ కేసులో అరెస్టయిన వంశీ ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో ఉన్నారు. వల్లభనేని వంశీ అక్రమ అరెస్ట్ నేపథ్యంలో వైఎస్ జగన్ ఇప్పటికే ఆయన సతీమణి పంజకశ్రీని ఫోన్‌లో పరామర్శించారు. రేపు విజయవాడ జిల్లా జైలుకు వెళ్లి పరామర్శించనున్నారు. ఇటీవలే మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ అరెస్ట్, కొఠారు అబ్బయ్య చౌదరిపై పెట్టిన అక్రమ కేసు వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. తీవ్ర అధికార దుర్వినియోగంతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అక్రమ అరెస్టులు చేస్తూ.. అసలు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని కూటమి ప్రభుత్వంపై మండిడ్డారు. వంశీ విషయంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ వ్యవహరిస్తున్న తీరు అత్యంత అన్యాయంగా ఉంది. గన్నవరం కేసులో తనపై - మిగతా3లో



## ఆ వ్యాఖ్యలతో మాకేంటి సంబంధం

కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జై రాం రమేష్
అది శామ్ పిట్రోడో వ్యక్తిగత అభిప్రాయం
దానితో పార్టీకి సంబంధం లేదు
శామ్ పిట్రోడో చేసిన వ్యాఖ్యలు పార్టీపై ఎటువంటి ప్రభావం చూపదు

# ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమేనా?

-మొదటిపేజీ తరువాయి

టీడీపీ వారు ఒత్తిడి తెచ్చి, తప్పుడు కేసు పెట్టించారంటూ సాక్షాత్తూ జడ్జిగారి ముందు దళిత యువకుడు వాంగ్మూలం ఇచ్చి, అధికారపార్టీ కుట్రను బట్టబయలు చేస్తే, తమ బండారం బయటపడిందని, తమ తప్పులు బయటకు వస్తున్నాయని తట్టుకోలేక, దాన్నికూడా మార్చేయడానికి చంద్రబాబుగారు దుర్మార్గాలు చేస్తున్నారు. సత్యానికి కట్టుబడి నిజాలు చెప్పినందుకు దళిత యువకుడ్ని పోలీసులను పంపించి మరీ వేధించడం ఎంతవరకు కరెక్టు? వాంగ్మూలం ఇచ్చిన రోజే ఆ దళిత యువకుడి కుటుంబంపైకి పోలీసులు, టీడీపీ కార్యకర్తలు వెళ్లి వారిని బెదిరించి, భయపెట్టడం కరెక్టేనా? ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమేనా?. మీ కక్షలు తీర్చుకోవడానికి ఇన్నిరకాలుగా వ్యవస్థలను వాడుకుని దుర్మార్గాలు చేస్తారా? సుప్రీంకోర్టు దృష్టిలో ఉన్న ఈ కేసులో, వారి ఆదేశాలను అనుసరించి దిగువ కోర్టు క్షుణ్నంగా కేసును విచారిస్తుంటే, పెట్టింది తప్పుడు కేసంటూ వాస్తవాలు బయటకు వస్తుంటే మొత్తం దర్యాప్తును, విచారణను, చివరకు జడ్జిని, న్యాయ ప్రక్రియను అపహాస్యం చేయడం, అధికారముందనే అహంకారంతో మీరు చేస్తున్నది అరాచకం కాదా ఇది? అధికార దుర్వినియోగం కాదా? వంశీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను. వంశీ భద్రతకు ఎలాంటి సమస్య వచ్చినా ఈ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. . మరోవైపు దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పై తప్పుడు కేసును తీవ్రంగా ఖండిస్తున్నాను. కళ్యాణ మండపం ప్రాంగణంలో అబ్బయ్య చౌదరి డ్రైవర్ టీడీపీ ఎమ్మెల్యే బూతులు తిట్టి.. తిరిగి అబ్బయ్య చౌదరిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడం దుర్మార్గం. టీడీపీ ఎమ్మెల్యే ఏం తిట్టారో ఆ వీడియోను కోట్లమంది ప్రజలు చూశారు. మరి ఎవరిపై చర్యలు తీసుకోవాలి?. తప్పులు టీడీపీ వారు చేసి, వారిపై చర్య తీసుకోమని కోరితే.. పోలీసులు ఎదురు కేసులు పెట్టి అన్యాయంగా వ్యవహరిస్తున్నారు. అందులోనూ 307, అంటే హత్యాయత్నం కేసులు పెట్టడం ఏంటి? అందులోనూ బాధితులపైన. రాష్ట్రంలో దిగజారిన వ్యవస్థలకు ఈ ఘటన నిదర్శనం కాదా? చంద్రబాబుగారూ! ప్రజలకు ఇచ్చిన సూపర్–6, సహా ఇచ్చిన 143 హామీలు నిలబెట్టుకోలేక, ఒక్కదాన్నీ కూడా అమలు చేయక, అంతకుముందున్న పథకాలను సైతం రద్దుచేసి, ప్రజలను సంక్షోభంలోకి నెట్టారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి మా పార్టీకి చెందిన నాయకులను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు, తప్పుడు సాక్షులతో అక్రమ అరెస్టులకు(%×శ్రీశ్రీవస్త్రుశ్రీ ాతీతీవర్ం%) దిగుతున్నారు. మీ తప్పులను ప్రజలే తమ డైరీల్లో రికార్డు చేసుకుంటూనే ఉన్నారు. తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తున్నాం అని ఎక్స్‌లో వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

# షర్మిల దెబ్బకు కాంగ్రెస్ క్లీన్ బౌల్డ్



**విజయవాడ :** సహజంగా అధికారపార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉంటుంది. ప్రతిపక్షపార్టీలను ఎవరూ పట్టించుకోరు. అధికారంలో లేని వారిని విమర్శించి కూడా ప్రయోజనం లేదు. ఎందుకంటే వారు పవర్ లో లేరు కాబట్టి విమర్శలు చేసినా వారు చేసేది శూన్యమే. కానీ విచిత్రంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వం పట్ల సాఫ్ట్ కార్నర్ గా ఉండటం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. ఇలా అయితే ఉన్ననాలుగు ఓట్లు కూడా వచ్చే అవకాశం లేదని సొంత పార్టీ నేతలే అంటున్నారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత రఘువీరారెడ్డి, సాకే శైలజానాథ్, గిడుగు రుద్రరాజు వంటి వారు నాటి అధికార పార్టీనే లక్ష్యంగా చేసుకుని పోరాడిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలే గుర్తు చేస్తున్నారు.. కానీ వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ అయిన నాటి నుంచి తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను మాత్రమే లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడాన్ని తప్పుపడుతున్నారు. జగన్ పై ఎన్ని విమర్శలు చేసినా ఇప్పుడు ప్రయోజనం లేదు. ఎందుకంటే జగన్ అధికారంలో లేరు. ఆయనను విమర్శించినా జనం పెద్దగా పట్టించుకోరు. ఆయన చేతుల్లో ఏమీ లేదు. మొన్నటి ఎన్నికల్లో దారుణంగా ఓటమి పాలయి తన ఇంటికే పరిమితయ్యారు. అలాంటి జగన్ పై రోజూ విమర్శలు చేయడం వల్ల ఏం ప్రయోజనం చెల్లీ అంటూ నేతలు ప్రశ్నిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. ఎన్నికల సమయంలో విమర్శలు చేసినా అర్థముంది. కానీ ఇప్పుడు జగన్ పై చేసే విమర్శలకు, ఆరోపణలకు విలువలేదన్న విషయం షర్మిలమ్మకు తెలియదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ అవకాశమొచ్చినప్పుడల్లా జగన్ ను వైఎస్ షర్మిల విమర్శించడాన్ని ప్రజలు కూడా పార్టీ పరంగా చూడటం లేదు. ఇది వ్యక్తిగత ద్వేషంతోనే విమర్శలు చేస్తున్నారన్నది బలంగా ముద్రపడిపోయింది. జగన్ గత ఎన్నికలలో ఓటమి పాలయింది తన వల్లనే అనుకునే భ్రమలో షర్మిల ఉందని, దాని నుంచి బయటకు వస్తేనే కొంత పార్టీతో పాటు ఆమెకు కూడా ప్రయోజనం అని నెట్టింట ప్రశ్నిస్తున్నారు. చచ్చిన పామును ఇంకా ఎంతకొట్టినా ప్రయోజనం ఏముంటుందని వారు అంటున్నారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ కు ఏపీలో ఒక్క శాతం ఓటు కూడా పెరగలేదు. ఎందరు పీసీసీ చీఫ్ లుగా మారినా కాంగ్రెస్ ను జనం ఆదరించలేదు. ఒక్క సీటును కూడా కాంగ్రెస్ పార్టీ గత మూడు ఎన్నికల్లో గెలుచుకోలేకపోయింది. పైగా వైఎస్ షర్మిల మిగిలిన పీసీసీ చీఫ్ లకు భిన్నంగా అధికార పార్టీ పట్ల మెతక వైఖరి తగదని సూచిస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించకపోగా, ప్రతపక్ష పార్టీపై చిందులు తొక్కినందున కాంగ్రెస్ తో పాటు కూటమి పార్టీలకు కూడా నష్టమేనని, అది జగన్ కు లాభిస్తుందన్న విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి. కానీ షర్మిల మాత్రం తన తీరును మార్చుకోవడం లేదు. మీడియా సమావేశం పెట్టినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా అది జగన్ కు వ్యతిరేకంగానే ఉండటంతో పరోక్షంగా వైసీపీకి షర్మిల మేలు చేస్తున్నారన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం మెతక వైఖరిని ప్రదర్శించినంత మాత్రాన ఓట్లు పెరుగతాయా? చెప్పు చెల్లీ అని కాంగ్రెస్ నేతలే ప్రశ్నిస్తున్నారు. మరి షర్మిలమ్మ దీనికి సమాధానం ఏంచెబుతారో చూడాలి.

# చింతమనేని చిరాకులేల...



**ఏలూరు :** దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఫైర్ బ్రాండ్ లీడర్. ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో ఉంటారు. ఆయన వివాదంలో లేకపోతేనే ఆశ్చర్యపోవాలి. అధికారంలో ఉన్నా లేకపోయినా చింతమనేని రూటే వేరు. తనపై అటెన్షన్ ఉండాలని చింతమనేని ఆకాంక్షిస్తారని భావించాలి. అందుకే తరచూ వివాదాలే రాజకీయంగా ఆయన ఎదుగుదలకు అడ్డంకిగా మారాయన్న కామెంట్స్ సొంత పార్టీ నుంచి వినపడుతున్నాయి. చింతమనేని ప్రభాకర్ సీనియర్ రాజకీయ నాయకుడు. 2019 ఎన్నికల్లో చింతమనే ప్రభాకర్ దెందులూరు నుంచి ఓటమి పాలయ్యారు. ఆయనపై వైసీపీ ప్రభుత్వం అనేక కేసులు నమోదు చేసింది. జైలుకు కూడా వెళ్లి వచ్చారు నేతలకు దిశానిర్దేశం నాడు పార్టీని ఇబ్బందుల్లో... 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత అప్పటి ఎమ్మార్వో వనజాక్షిని బెదిరించిన వైనం చింతమనేని ప్రభాకర్ ను రాజకీయంగా ఇబ్బందులపాలు చేసింది. అంతేకాదు పార్టీ ప్రతిష్టను కూడా దిగజార్చింది. అయినా తగ్గేదేలే అన్నట్లు ఆయన తీరు ఉంటుంది. చింతమనేని ప్రభాకర్ నిత్యం ప్రజల్లో ఉంటారు. అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ కొంత మంచిపేరు తెచ్చుకుంటారు. కానీ ఆ మంచి పేరు వివాదాలతోనే తనకు తానే చెరిపేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీని మాత్రమే నమ్ముకున్న చింతమనేని 2019 ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై కూడా హాట్ కామెంట్స్ చేసి ఒకవర్గానికి దూరమయ్యారన్న వ్యాఖ్యలు పార్టీలో ఇప్పటికీ వినిపిస్తున్నాయ. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సీనియర్ నేతగా ఉన్న ప్పటికీ ఆయనకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్దగా పదవులు దక్కలేదు. 2009, 2014లో వరసగా దెందులూరు నియోజకవర్గం నుంచి గెలిచిన చింతమనేని ప్రభాకర్ 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అయినా పార్టీ కోసం జెండా వదలలేదు. కార్యకర్తలకు అండగా నిలబడటంలో ముందున్నారు. అనేక కేసులు తనపై నమోదవుతున్నా చింతమనేని ప్రభాకర్ బెదరలేదు. భయపడలేదు. అలాగే అధికార పార్టీకి తలవంచే నైజం కాదు. అదే చింతమనేని ప్రభాకర్ లో ప్లస్ పాయింట్ అని తెలుగు తమ్ముళ్లు అంటారు? తాజాగా మరో వివాదం... తాజాగా మరో వివాదం ఆయన తన నెత్తిమీదకు తెచ్చుకున్నారు. ఒక వివాహ కార్యక్రమానికి హాజరైన చింతమనేని ప్రభాకర్ తనకారుకు అడ్డంగా నిలిపారని స్వయంగా తానే దిగి డ్రైవర్ ను దుర్భాషలాడిన వీడియో సామాజికమాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఆ వాహనం మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిది కావడంతోనే అసలు సమస్య. దీంతో పార్టీ అధినేత చంద్రబాబును కలసి జరిగిన ఘటనపై ఆయన వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లభనేని వంశీ తర్వాత కొడాలి నాని కూడా జైలుకు వెళతారని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత మరికొందరు నేతలు జైలుకు వెళతారన్న చింతమనేని అబ్బయ్య చౌదరి సాఫ్ట్ వేర్ కాదని, హార్డ్ వేర్ అని అన్నారు. మొత్తం మీద మరోసారి చింతమనేని వివాదానికి కేరాఫ్ అడ్రస్ గా మారడంతో పార్టీ నేతలు కూడా కొంత ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా చింతమనేనికి క్లాస్ పీకినట్లు తెలిసింది.

## ఆచితూచి వ్యవహరిస్తున్న కాపులు

**కాకినాడ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పుడిప్పుడే పదవిలో కుదురుకుంటున్నారు. ఆయన డిప్యూటీ ముఖ్యమంత్రి బాధ్యతలను చేపట్టి ఎనిమిది నెలలు మాత్రమే అవుతుంది. గత కొన్ని నెలల నుంచి ఆయన తనకు అప్పగించిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల పై ఎక్కువ ఫోకస్ పెట్టారు. ఈ శాఖను ప్రక్షాళన చేయడం మొదలు పెట్టారు. ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి వరకూ భారీ మార్పులు చేసి, బదిలీలు చేసి కొంత మంచి అధికారులను నియమించారు. ఈ శాఖ ద్వారా ప్రజలకు మరింత, మెరుగైన సేవలు చేయాలన్న లక్ష్యంతో పవన్ కల్యాణ్ ఏరి కోరి గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖను అడిగి తీసుకున్నారు. ప్రజలకు ఏదో చేయాలన్న తపన ఆయన ప్రతి అడుగులో కనిపిస్తుంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖకు న్యాయం చేయాలన్న తపనతో ముందుకు వెళుతున్నారు. ఆయన మరేదీపెద్దగా పట్టించుకోవడం లేదు. కేవలం లడ్డూ వివాదంపై తలదూర్చడం మినహా మిగిలిన రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. అలాగే నిధుల కోసం ఢిల్లీకి పరుగులు తీయడం, కేంద్ర మంత్రులను కలవడం వంటి వాటికి దూరంగా ఉన్నారు. హంగూ ఆర్భాటాలను ప్రదర్శించడం లేదు. కేవలం తన కార్యాలయం, పార్టీ ఆఫీసు అంత వరకే పవన్ కల్యాణ్ పరిమితమయ్యారు. ఆ ఒక్కటీ తప్ప మరే ఆలోచనను ఆయన చేయడం లేదు. ఆయన లక్ష్యం ఒక్కటే. తాను తీసుకున్న శాఖకు హండ్రెడ్ పర్సెంట్ న్యాయం చేయాలన్నదే. కానీ ఇది కొంత క్యాడర్‌కు, ఆయన పార్టీ జనసేన, కూటమి పార్టీ గెలుపునకు అద్భుతమైన విజయాన్ని అందించడంలో కీలకమైన కాపు సామాజికవర్గంలో మాత్రం కొంత అసంతృప్తి కనిపిస్తుంది. అసహనమూ బయలుదేరిందంటున్నారు. ఆయన వద్దకు వెళ్లిన కొందరు మాత్రమే వ్యక్తిగతంగా ప్రయోజనం, లబ్ది పొందుతున్నా రు కానీ, కాపు సామాజికవర్గం గురించి పవన్ కల్యాణ్ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో విజయం అందించిన కాపు సామాజికవర్గానికి ఏదో ఒక ప్రయోజనం చేకూరుస్తారని పవన్ కల్యాణ్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు కాపులు. ముఖ్యమంత్రి కాకపోయినా ఉప ముఖ్యమంత్రి అయినా పెద్దగా రెస్పాన్స్ లేదు. ఎనిమిది నెలలు దాటుతున్నా... అయితే కాపు సామాజికవర్గం నుంచి కూడా ఈ విషయంలో పెద్దగా ఎవరూ బయటపడలేదు. అందరూ మౌనంగానే ఉన్నారు. ఎనిమిది నెలలయినా తమ గురించి, తమ కమ్యునిటీ గురించి పట్టించుకోవడం లేదన్న కొంత అసంతృప్తి అయితే ఉభయగోదావరి జిల్లాల్లో కనిపిస్తుంది. గత ఎన్నికల్లో తూర్పు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాల్లో కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేశాయి. ఆ జిల్లాలపై కూడా ప్రత్యేకంగా పవన్ కల్యాణ్ ఫోకస్ పెట్టింది లేదు. పర్యటించింది కూడా తక్కువే. మంత్రి వర్గ సమావేశాల్లోనూ తమ కమ్యునిటీ ప్రయోజనాల గురించి ప్రస్తావించిన సందర్భం లేకపోవడం వారిని ఒకరకంగా ఇబ్బంది పెడుతుంది. ప్రస్తుతానికి వారు సైలెంట్ గా ఉన్నప్పటికీ, కొద్దికాలమైన తర్వాత అయినా తమను గురించి పట్టించుకుంటారన్న ఆశతో ఉన్నారు. మరి పవన్ ఏం చేస్తారో అన్నది వేచిచూడాల్సిందే.

## మహాకుంభమేళాలో మంత్రి లోకేష్ దంపతుల పుణ్యస్నానాలు

-మొదటిపేజీ తరువాయి

పవిత్ర పూజల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో లోకేష్ దంపతులు మమేకమయ్యారు. మహా కుంభమేళా ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదు.. ఇది భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వం. నమ్మకం, ఆచారాలు, ఆధ్యాత్మిక జ్ఞానంతో ముడిపడి ఉన్న శక్తిమంతమైన వేడుక. మానవత్వం, ఆధ్యాత్మికత మధ్య సంబంధాన్ని, లోతుగా నాటుకుపోయిన భారతజాతి విలువలను ప్రతిబింబిస్తుంది. పవిత్ర నదుల్లో ఆచరించే స్నానం, దానం, హృదయ పూర్వకమైన భక్తి మోక్ష మార్గాన్ని చూపిస్తాయని కోట్లాదిమంది నమ్మకం. కుంభమేళాలో స్నానాలు, పూజాధికాల అనంతరం లోకేష్ దంపతులు కాశీ విశ్వేశ్వరుని ఆలయాన్ని సందర్శించేందుకు వారణాసి వెళ్లారు.

**ఢిల్లీలో భూకంపానికి ముందు భారీ శబ్ధం.. కారణమదేనా..**

కాగా.. జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా ఫిబ్రవరి 26న ముగియనుంది. దాదాపు 45 రోజుల పాటు సాగే మహాకుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివెళ్తున్నారు. కోట్లలో భక్తులు త్రివేణీ సంగమంలో స్నాణాలు ఆచరిస్తున్నారు. జనవరి 13%శ్రీ% మహాకుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి గత శుక్రవారం వరకు త్రివేణి సంగమంలో స్నానమాచరించిన భక్తుల వివరాలను యూపీ ప్రభుత్వం ప్రకటించింది. రికార్డు స్థాయిలో ఏకంగా 50 కోట్ల మంది భక్తులు స్నానమాచరించారని ఇది చరిత్రలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక తీర్థయాత్రగా యూపీ సర్కార్ పేర్కొంది.

## దేవాలయాలు ఆధ్మాత్మిక కేంద్రాలే కాదు... ప్రధాన ఆదాయ వనరులు

-మొదటిపేజీ తరువాయి

చేపడుతున్నామని వివరించారు.

దేవాలయాలు ఆధ్మాత్మిక కేంద్రాలే కాదు... ప్రధాన ఆదాయ వనరులు కూడా అని అభిప్రాయపడ్డారు. దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రస్తుతం కాలంలో అందరూ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. ఎందరో భక్తులు రూ.కోట్లలో విరాళాలు ఇస్తున్నారని వెల్లడించారు. విరాళాలను విద్య, వైద్యం, ఇతర సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని తెలిపారు. ఏపీలోని దేవాలయాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, దేవాలయాల్లో పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తిరుమలలో 75 శాతం పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణలో ఆలయాలది ప్రధాన పాత్ర అని తెలిపారు.

నాడు ఎన్టీఆర్ ఏపీ దేవాలయాల్లో అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారని చంద్రబాబు గుర్తుచేశారు. ఇవాళ నిత్యం లక్షల మంది అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారని వివరించారు. దేశ విదేశాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయాలు పెరుగుతున్నాయని, ఇంకా పెరగాలని ఆకాంక్షించారు. ఏపీలో దేవాలయాల సర్క్యూట్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**తిరుపతిలో అంతర్జాతీయ దేవాలయాల సదస్సును ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతిలో అంతర్జాతీయ దేవాలయాల సదస్సును ప్రారంభించారు. ఈ దేవాలయాల మహాకుంభ్ సమావేశం మూడు రోజుల పాటు జరగనుంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హాజరయ్యారు. ఆ భారీ ఆధ్యాత్మిక సదస్సులో ప్రపంచంలోని 58 దేశాల నుంచి వచ్చిన 1,581 ఆలయాలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ సదస్సులో 15 వర్క్ షాప్ లు నిర్వహించనున్నారు. 60 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఒకరోజు కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. ఈ నెల 19న ఏపీ మంత్రి నారా లోకేశ్ హాజరు కానున్నారు. కాగా, ఇవాళ సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా... ముంబయిలో టీటీడీకి స్థలం కేటాయించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. ముంబయిలో అమ్మవారి ఆలయం నిర్మాణం, బాంద్రాలో టీటీడీ సమాచార కేంద్రం కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఫడ్నవీస్ కు వినతి పత్రం అందించారు.

## మార్చిలో జనసేన వర్సెస్ వైసీపీ

**విజయవాడ :** మార్చి సమీపిస్తోంది.. మరో 10 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. మార్చి 12న వైసీపీ ఆవిర్భావ దినోత్సవం జరగనుంది. అదే సమయంలో జనసేన ప్లీనరీ సైతం జరగనుంది. దీంతో అంతటా పొలిటికల్ హీట్ ఉంటుంది ఈ నెలలో. ఇప్పుడిప్పుడే వేసవి ప్రారంభమైంది. రాజకీయ వేడి కూడా ఉంది. ఇటువంటి తరుణంలో రెండు పార్టీలకు సంబంధించి కీలక కార్యక్రమాలు మార్చిలోనే ఉండడం విశేషం. దీంతో పోటా పూర్తిగా ప్రకటనలు ఉండనున్నాయి. అదే సమయంలో రాజకీయ విమర్శలు, వ్యూహాలు సైతం కొనసాగనున్నాయి. దీంతో మార్చిలో పొలిటికల్ హైట్ అండ్ సన్ వాతావరణం క్రియేట్ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అధికార, విపక్షాలకు సంబంధించి ఒకే రోజు కార్యక్రమాల నిర్వహణ ఉండడంతో తప్పకుండా రాజకీయ అంశాలు, సంచలనాలు ఉండనున్నాయి.జనసేన ప్లీనరీని మార్చి 12 నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. పిఠాపురంలో ప్లీనరీ నిర్వహిస్తుండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. లక్షలాదిమంది తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జనసేనకు ఈ ఎన్నికల్లో మంచి విజయం దక్కింది. కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది జనసేన. అందుకే ఈ ప్లీనరీ జనసేనకు ప్రత్యేకం. ఇదే వేదికగా జనసేన సంచలన నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అటు రాజకీయంగా కొన్ని రకాల నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.అయితే ఇదివరకు ఎన్నడూ లేని గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది వైయస్సార్ కాంగ్రెస్పార్టీ. 2012 మార్చి 12న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించింది. పుష్కర కాలం దాటి 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటుంది ఆ పార్టీ. అయితే తొలి ఆరేళ్లు బలమైన ప్రతిపక్షంగా ఉంది వైయస్సార్ కాంగ్రెస్. గత ఐదు సంవత్సరాలుగా అధికారపక్షంగా ఉండేది. అయితే ఈ ఎన్నికల్లో ఘోర పరాజయంతో ఆ పార్టీ పరిస్థితి మారింది. ఇప్పటివరకు ఒక లెక్క.. మొన్నటి ఎన్నికల తర్వాత మరో లెక్క అన్నట్టు ఉంది ఆ పార్టీ పరిస్థితి. చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం ఇది. అందుకే అధినేత జగన్మోహన్ రెడ్డి దూకుడుగా అడుగులు వేస్తున్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవం నాడు ఆయన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.ఉగాది నుంచి ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అదే సమయంలో పార్టీకి చెందిన కీలక నేతలు రాజీనామాలు ప్రకటిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లతో పాటు తటస్థ నేతలు వైసిపి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు కీలక నిర్ణయాలు వెల్లడిస్తారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇంకోవైపు కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన సైతం.. ప్లీనరీ వేదికగా సంచలన ప్రకటనలు చేసే పరిస్థితి ఉంది. దీంతో సర్వత్రా దీనిపై ఉత్కంఠ కొనసాగుతోంది. మార్చిలో పొలిటికల్ హీట్ కొనసాగే పరిస్థితి ఉంది. చూడాలి మరి ఎలాంటి పరిణామాలు జరగబోతాయో!

## టెక్నాలజీ సాయంతో గంజాయి పట్టివేత

**నెల్లూరు :** నెల్లూరు గంజాయి రవాణాకు స్టాక్ పాయింట్‌గా మారిందన్న ఆరోపణలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఒరిస్సాతోపాటు ఏపీలోని విశాఖ ప్రాంతాల నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు నిత్యం గంజాయి అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. తరచూ హైవేపై పోలీసుల తనిఖీల్లో విలువల కొద్దీ పట్టుబడుతున్న గంజాయి నిల్వలే అందుకు నిదర్శనం. గంజాయి రవాణా స్టార్టింగ్ పాయింట్ నుంచి డెలివరీ పాయింట్ వరకు నేరుగా ఒకేసారి సరఫరా చేయడం సాధ్యం కాదు. ఎందుకంటే నిత్యం వాటిపై నిఘా ఉండడం. విశాఖ నుంచి నేరుగా ఒక్కసారిగా తమిళనాడు లేదా కర్ణాటక లకు తరలించడం సాధ్యం కాకపోవడంతో నెల్లూరును స్టాక్ పాయింట్‌గా ఏర్పాటు చేసుకుని ఇక్కడి నుంచి అనువైన రోజున ఇతర రాష్ట్రాలకు తరలిస్తోంది గంజాయి మాఫియా.ఈ క్రమంలోనే పక్కా సమాచారం పోలీసులకు అందింది.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 18.02.25 మంగళవారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
ప్రకాశం



## కరాటే పోటీల విజేతలను అభినందించిన ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 17)

ఆదివారం అద్దంకి పట్టణంలోని వెంకటేశ్వర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో పొదిలి మండలానికి చెందిన వ్యక్తిగత కటా విభాగంలో మొదటి బహుమతి , కుమితే విభాగంలో మొదటి బహుమతి యర్రం రెడ్డి జై సాయి విష్ణువర్ధన్ రెడ్డి , బాలికల వ్యక్తిగత కటా విభాగంలో (తరువాయి 4లో...)

## ఇబ్బందులు లేని దర్శనమే లక్ష్యంగా

# కోటప్పకొండలో ఏర్పాట్లు

భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక ప్రణాళిక

రాష్ట్ర పండుగ హోదాలో మహా శివరాత్రి వేడుకలు

గత ఐదేళ్లుగా పవిత్ర శైవక్షేత్ర నిర్వహణను పట్టించుకోని వైసీపీ

సీఎం చంద్రబాబు నేతృత్వంలో కోటప్పకొండకు పూర్వ వైభవం

పల్నాడు జిల్లా ఇన్చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు బ్యూరో, పల్నాడు, ఫిబ్రవరి 17)

మహా శివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు వచ్చిన భక్తులందరూ.. ఎటువంటి ఇబ్బందీ లేకుండా పరమేశ్వరుడిని మంచి దర్శనం చేసుకునే విధంగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పల్నాడు జిల్లా ఇన్చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈనెల 26వ తేది మహా శివరాత్రిని పురస్కరించుకుని కోటప్పకొండలో జరిగే ఉత్సవాల ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, అరవింద్‌లతో కలిసి మంత్రి గొట్టిపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల క్యూలైన్ల ఏర్పాట్లతో పాటు వారికి తాగునీటి సదుపాయం, రవాణ, శానిటేషన్, భక్తులకు తాత్కాలిక వసతి వంటి అంశాలను అధికారులతో చర్చించారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కోటప్పకొండ మహా శివరాత్రి తిరునాళ్లను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. లక్షలాది భక్తులు తరలివచ్చే ప్రాంతం కావడంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు కోటప్పకొండ ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక శోభ పరిఢవిల్లేలా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందుల లేకుండా చూడాలన్నారు. అదే విధంగా సమాచార మార్పిడి లోపం లేకుండా, మైక్ ప్రచార కేంద్రం నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.



**కోటప్పకొండకు పూర్వ వైభవం...**

టీడీపీ ప్రభుత్వ హయాంలో కోటప్పకొండ ఎంతో అభివృద్ధి జరిగిందని, మాజీ స్పీకర్ దివంగత నేత కోడెల శివప్రసాద్ కోటప్పకొండ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో కృషి చేశారని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రమైన కోటప్పకొండ... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో (తరువాయి 4లో...)

# జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

జర్నలిస్టుల సమస్యలపై జేసీకి వినతి పత్రం అందచేసిన డిజెఎఫ్ సభ్యులు

ఒంగోలులో జర్నలిస్టులకు శాశ్వత ప్రెస్ క్లబ్‌ను ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలో జరుగుతున్న జర్నలిస్టుల పై దాడులను అరికట్టాలి

అక్రిడేషన్ కమిటీలో డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం సభ్యులకు అవకాశం కల్పించాలి

విద్యార్థులకు ఫీజులతో సంబంధం లేకుండా హాల్ టికెట్ ను అందజేయాలి

హాల్ టికెట్ల సమస్యలపై కాలేజీ ప్రాంగణంలో కరపత్రాలతో పాటు

టోల్ ఫ్రీ నెంబర్‌ను వెంటనే విడుదల చేయాలి

అధికారులకు జేసీ ఆర్ గోపాలకృష్ణ ఆదేశం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)

జర్నలిస్టుల సమస్యలపై ఒంగోలు కలెక్టరేట్ ఆవరణంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఏపీ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం సభ్యులు కలిసి జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రంను అందజేశారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి, ఒంగోలు లో శాశ్వత ప్రెస్ క్లబ్ ను ఏర్పాటు చేయాలన్నారు. మన్యం జిల్లాలో విలేకరిపై దాడిని డి జె ఎఫ్ సభ్యులు ఖండించారు. రాష్ట్రంలో జరుగుతున్న జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలను తీసుకోవాలని కోరారు.అలానే అక్రిడేషన్ కమిటీలో డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం సభ్యులకు అవకాశం కల్పించాలని తెలియచేశారు.కొంత మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజుల సమస్యలపై గతంలో జిల్లా కలెక్టర్ కు అందజేసిన వినతి పత్రాలపై జాయింట్ కలెక్టర్ తో డీజే ఎఫ్ సభ్యులు చర్చించారు.సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ విద్యార్థులకు ఫీజులతో సంబంధం లేకుండా హాల్ టికెట్ ను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు.హాల్ టికెట్ల సమస్యలపై కాలేజీ ప్రాంగణంలో కరపత్రాలతో పాటు టోల్ ఫ్రీ నెంబర్ను వెంటనే విడుదల చేయాలని, అలానే విద్యార్థులకు వాట్సప్ ద్వారా హాల్ టికెట్ను డౌన్లోడ్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.హాల్ టికెట్ల విషయంలో విద్యార్థులకు ఇబ్బందులకు గురి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీజేఎఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నూకతోటి రవికుమార్, బొడ్డు శ్రీనివాసులు, రాజు, నగర ఉపాధ్యక్షుడు ఉబ్బా అశోక్, సంజీవరావు, షేక్ నాసిర్, ప్రతాప్‌రెడ్డి, చెన్నుబోయిన అశోక్, బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# వేటగాళ్ల ఉచ్చులో పడి చిరుత పులి మృతి

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 17)

యర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి అటవీ శాఖ కార్యాలయ పరిధిలో గల కొలుకుల ఫారెస్టు బీట్ పరిధిలోని కొలుకుల- గంజివారిపల్లి గ్రామాల మధ్య గల నల్లమల అటవీ ప్రాంత సమీపంలో వేటగాళ్లు అడవి పందుల కోసం వేసిన ఉచ్చులో చిక్కి ఆదివారం సాయంత్రం చిరుతపులి మృతి చెందింది.



ఈ సందర్భంగా మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ మాట్లాడుతూ వేటగాళ్లు పందుల కోసం వేసిన ఉచ్చుల్లో చిక్కుకొని చిరుతపులి మృతి చెందినట్లు చెప్పారు. ఉచ్చుల్లో చిక్కుకున్న సమాచారం తెలియగానే అటవీ శాఖ ప్రభుత్వ పశు వైద్యులతో దానిని రక్షించేందుకు అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదన్నారం. ఆదివారం సాయంత్రం 3:30 (తరువాయి 4లో...)



# ప్రక్షాళణ

## విలీనమైన తరగతులు యధా స్థానానికి విద్యాలయాల విభజనకు గ్రీన్ సిగ్నల్

## వచ్చే విద్యా సంవత్సరం నుంచి సమూల మార్పులు



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఫిబ్రవరి 17)

కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైంది. గతంలో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను వెనక్కి పంపేందుకు సంసిద్ధమైంది. ఈ మేరకు రానున్న విద్యా సంవత్సరం నుంచే అడుగులు వేసేందుకే ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో ప్రమాదంలో పడిన పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పిల్లలకు మెరుగైన బోధన అందించాలన్న విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు సంస్కరణలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కీలకమైన 117 జీవోను ఉపసంహరించాలని నిర్ణయించారు. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రాథమిక విద్యలో సమూల మార్పులు రానున్నాయి.

**అభిప్రాయ సేకరణలో ప్రభుత్వం :** కొత్త విధానంలో పాఠశాలలను నాలుగు విభాగాలుగా చేస్తారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ, మోడల్ హైస్కూల్, హైస్కూల్‌గా విభజిస్తారు. 60 లోపు పిల్లలున్న ప్రాథమికోన్నత బడులను రద్దు చేసి సమీప ఉన్నత పాఠశాలలో కలుపుతారు. 60కి పైగా విద్యార్థులుంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తారు. ఇందుకోసం జిల్లాలో 150 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో 15 నుంచి 25 బడులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. వీటిలో చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు క్లస్టర్, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే తల్లిదండ్రుల కమిటీ (పీఎంసీ)ల అభిప్రాయాలు సేకరించారు. ఆ మేరకు 23న నిర్వహించే సమావేశంలో ప్రాథమిక నివేదిక అందజేయనున్నారు. మే నెల మొదటి వారానికి ప్రక్రియ పూర్తిచేసి ఆ తరువాత ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపడతారు. క్లస్టర్ కేంద్రంలోని పాఠశాలను మోడల్ విద్యాలయంగా తీర్చిదిద్దుతారు. అక్కడే ఉపాధ్యాయులకు శిక్షణలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించేలా వసతులు కల్పిస్తారు. 117 జీవో రద్దు చేశాక పాఠశాల వ్యవస్థను ఎలా పునర్నిర్మించాలన్న అంశంపై ఇప్పటికే డీఈవోలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు ప్రాథమిక నివేదిక రూపొందించారు. సిబ్బందికి మరింత స్పష్టత ఇచ్చేందుకు, అనుమానాలు నివఅత్తి చేసేందుకు గత నెల 23న ఒంగోలు నగరంలోని ఎంఎస్ కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు, ఆర్జేడీ, డీఈవోలు, ఎంఈవోలు, క్లస్టర్ ఇంఛార్జులు మొత్తం 500 మంది హాజరుకానున్నారు. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ముఖ్య అతిథిగా హాజరై దిశా నిర్ధేశం చేశారు.

**గత ప్రభుత్వ తీరుతో కుదేలు :** గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన 117 జీవోతో పాఠశాల విద్యా వ్యవస్థ చిన్నాభిన్నమైంది. జిల్లాలో 320 ప్రాథమిక విద్యాలయాల్లోని 3, 4, 5 తరగతులను 290 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. పిల్లల రాకపోకలకు అనువుగా ఉన్నచోటే విలీనం చేయాలని సూచించినా అదేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారం కలిపేయడంతో చాలా ప్రాథమిక బడులు అనాథగా మారాయి. ఒకటో తరగతి ప్రవేశాలు పడిపోయాయి. ఫలితంగా ఉపాధ్యాయుల సంఖ్య అదనంగా తేలింది. మరో వైపు మొదటి దశలో నాడు-నేడు కింద ప్రాథమిక పాఠశాలల్లో నిర్మించిన తరగతి గదులు నిరుపయోగంగా మారాయి. మొత్తంగా విద్యారంగం మనుగడే ప్రమాదంలో పడింది.

**ఉదంతాలు ఇవీ....** సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో 25 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. అప్పట్లో 3, 4, 5 తరగతుల విలీనం కారణంగా ఒక ఉపాధ్యాయుడు, ఇద్దరు పిల్లలు మిగిలారు. తరువాత చిన్నారులను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపకపోవడంతో ప్రస్తుతం నలుగురు పిల్లలు మాత్రమే ఉన్నారు. మరోవైపు విలీనం చేసిన ఉన్నత పాఠశాలలో మూడో తరగతిలో విద్యార్థులే లేరు. నాలుగులో నలుగురు, అయిదో తరగతిలో అయిదుగురు మాత్రమే ఉన్నారు. విలీనం కారణంగా మద్దిపాడు మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పదికి మించడం లేదు. (తరువాయి 4లో...)

# కరాటే పోటీల విజేతలను అభినందించిన ఎమ్మెల్యే కందుల



మొదటి బహుమతి, కుమితే విభాగంలో ద్వితీయ బహుమతి ఎన్ వి ఎన్ సాయి కీర్తన, బాలుర వ్యక్తిగత కటా విభాగంలో మొదటి బహుమతి ఆకాష్, బాలుర వ్యక్తిగత కటా విభాగంలో మొదటి బహుమతి వెంకట సాయి వంశీ సాధించారు.. సోమవారం ఉదయం మార్కాపురంలోని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నివాసంలో విజేతలను శాలువాలతో సత్కరించి స్వీట్లు అందజేశారు. మరిన్ని విజయాలు సొంతం చేసుకొని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ వేణు వారి కుమారుడు మాస్టర్ మాధవ్, ఎర్రంరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రక్షాళణ

## విలీనమైన తరగతులు యధా స్థానానికి విద్యాలయాల విభజనకు గ్రీన్ సిగ్నల్

ప్రస్తుతతం మల్లవరం ఎస్సీ కాలనీ బడిలో 6, తెల్లబాడు మెయిన్ 8, ఇనమనమెళ్లూరు 7, బసవన్నపాలెం ఎస్సీ కాలనీ 3, పెద కొత్తపల్లి మెయిన్ పాఠశాలలో నలుగురు పిల్లలు మాత్రమే ఉన్నారు. జిల్లాలోని చాలా వరకు ప్రాథమిక పాఠశాలల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుంది.

# వేటగాళ్ల ఉచ్చులో పడి చిరుత పులి మృతి

గంటల సమయంలో మృతి చెందినట్లు చెప్పారు. అటవీ జంతువులను వేటాడడం చట్టరిత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# వ్యాధి తీవ్రత తగ్గేవరకు పక్క జిల్లాల నుంచి ఎవరు కోళ్లను దిగుమతి చేసుకోవద్దు



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 17)**

కోళ్లకు సంక్రమించే బర్డ్ ఫ్లూ వ్యాధి రాకుండా కోళ్ల ఫారం యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలని చౌటపాలెం పశు వైద్యాధికారి జె.శివరామకృష్ణ అన్నారు. రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రబులుతున్న నేపథ్యంలో మండలంలోని పరుచూరి వారి పాలెం గ్రామంలోని బాయిలర్ కోళ్ల ఫారంను సోమవారం సందర్శించారు. శివరామకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు ఎక్కడ బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని కోళ్లను పెంచే రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని, వ్యాధి తీవ్రత తగ్గేవరకు పక్క జిల్లాల నుండి ఎవరు కోళ్లను దిగుమతి చేసుకోవద్దని సకాలంలో టీకాలు, యాంటీబయోటిక్ మందులు వాడటం వలన వ్యాధి రాకుండా అరికట్టవచ్చని అదేవిధంగా బయో సెక్యూరిటీ పద్ధతులు పాటించాలని తద్వారా కోళ్లల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకకుండా నివారించవచ్చని తెలిపారు. ప్రజలు ఎటువంటి అపోహాలు నమ్మకుండా బాగా ఉడికించిన మాంసం మరియు గుడ్లని సురక్షితంగా తినవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకుడు సురేష్, రైతులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 17)** మండలంలోని వెంకుపాలెం గ్రామ సమీపంలో సోమవారం ఎస్ఐ అనుక్ ఆధ్వర్యంలో గస్తీ నిర్వహించారు. ఎస్సై అనుక్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలని కాపాడటమే కాకుండా వారి కుటుంబాన్ని కూడా కాపాడుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు, ప్రభుత్వాలు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్న చాలామంది విద్యావంతులు కూడా హెల్మెట్ ధరించకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వాహనదారులకు ఇబ్బందిగా ఉండటంతో యాక్సిడెంట్ అవ్వకుండా ఉండేందుకు పొన్నలూరు ఉప్పలదిన్నె రోడ్డుకు ఇరువైపులు ఉన్న చిల్ల చెట్లను , పిచ్చి మొక్కలలను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



# ఇబ్బందులు లేని దర్శనమే లక్ష్యంగా కోటప్పకొండలో ఏర్పాట్లు

అభివృద్ధికి దూరమయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో.. గత ప్రభుత్వ పాలకులు భక్తుల మనోభావాలకు వ్యతిరేకంగా... కోటప్పకొండ నిర్వహణను గాలికి వదిలేశారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత మహా శివరాత్రిని పురస్కరించుకుని భక్తులకు మంచి దర్శనం అందే విధంగా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్యూ లైన్లు రద్దీ క్రమబద్ధీకరిస్తూ.. ఉచిత దర్శనంతో పాటు అందరికీ ఆ దేవదేవుని దర్శనం అందేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా అధికారుల సూచనలను పాటిస్తూ ఎటువంటి ఇబ్బందీ లేకుండా దర్శనం పూర్తి చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కోటప్పకొండను రాష్ట్రంలోనే ప్రముఖ శైవక్షేత్రంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కోటప్పకొండకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అనేక అభివృద్ధిపనులు చేపట్టినట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి



# ఎన్డీఏ కూటమికి మద్దతు ఇచ్చి అభివృద్ధిలో భాగస్వాములు అవ్వండి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఫిబ్రవరి 17)**

ఆగాధంలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. సోమవారం మాచర్ల పట్టణంలో శాసనమండలి ఎన్నికల బరిలో ఉన్న ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనేక పరిశ్రమలు పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వెనకడుగు వేసిన సంఘటనలను చూసామని ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిన సంఘటనలు సైతం జరిగాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుండే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి సారించి అనేక పరిశ్రమలను ఆంధ్రప్రదేశ్ వైపు పెట్టుబడులు పెట్టించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు వలన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. మాచర్ల నియోజకవర్గం లో ఇప్పటికే పలు దఫాలుగా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు అండగా తమకూటమి ప్రభుత్వం నిలబడుతూ ఉందని అన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల విడుదల కానుందని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేసి నిరుద్యోగుల జీవితాలలో వెలుగు నింపే దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీ రుణాలను గత ప్రభుత్వం అందజేయలేదని వాటిని దారి మళ్లించిన విషయాన్ని గుర్తు చేశారు ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం బి సి,ఎస్ సి, ఎస్ టి, ఓ సి, కార్పొరేషన్ ద్వారా సంబంధిత వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటును మొదటి ప్రాధాన్యతగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మద్దిరాల మ్యాని, చైర్మన్ పోలూరు నరసింహారావు, పట్టణ అధ్యక్షులు కొమర దుర్గారావు, క్లస్టర్ ఇంచార్జ్ సయ్యద్ అన్వర్ భాష, ఎన్డీఏ కూటమి నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, ఎనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, ఓర్సు క్రాంతి కుమార్, మద్దిగప్పు చిన్న వెంకటరామిరెడ్డి, గోగుల వెంకట్రామిరెడ్డి, కొమ్మెర లాలా, వినోద్, మాచర్ల పట్టణ యూనిట్ ఇన్చార్జులు భూత్ ఇన్‌చార్జిలు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చితికిన కూలి బతుకుల కుటుంబాలను ఆదుకోండి

## మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త షేక్ సైదా డిమాండ్



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 17)**

పట్టణంలోని కొండారెడ్డి కాలనీకి చెందిన దాదాపు 30 మంది పేద కూలీలు మిర్చి కోతలకు మార్కాపురం పట్నం నుంచి పెద్దారవీడు మండలం చెట్ల మిట్ట గ్రామానికి మినీ వ్యాన్‌లో ప్రయాణించి తిరుగు ప్రయాణంలో నికరం పల్లి వద్ద టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి రోడ్డు మీద బోల్తా పడటంతో మృతి చెందిన షేక్ మున్ని (35) అరబోలు లక్ష్మీదేవి (40) కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి పది లక్షల రూపాయలు ఎక్స్రేషియా చెల్లించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మార్కాపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త షేక్ సైదా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం లో పొలంలో కరెంట్ స్తంభానికి ట్రాక్టర్ గుద్దుకొని బోల్తా పడి ఆరుగురు మహిళ కూలీలు మరణిస్తే ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఆర్థిక సహకారం అందించిందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది వ్యవసాయ సీజన్ కాబట్టి వ్యవసాయ కార్మికులు తమ కుటుంబాల పోషణ నిమిత్తం జిల్లాలో అనేక ప్రాంతాల్లో రోజువారి కూలీలు పొట్ట చేత పట్టుకుని వ్యవసాయ పనులకు వెళ్తున్నారని ప్రమాదం అని తెలిసిన తప్పని పరిస్థితుల్లో ఆటోల్లో, బస్సుల్లో, లారీల్లో ప్రయాణించి మిర్చి కోత పనులకు వెళుతున్నారని వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని సైదా అన్నారు. ఈ ప్రమాదంలో " రెక్క ఆడితే కానీ డొక్క నిండని" పేదల బ్రతుకులు రోడ్డు ప్రమాదాల రూపంలో చితికి పోతున్నాయనీ అలాంటి కుటుంబాలను ఆదుకోవలసిన కనీస ధర్మం ప్రభుత్వానిదే అని సైదా అన్నారు. మృతి చెందిన షేక్ మున్ని, లక్ష్మీదేవి కుటుంబాల ను ప్రభుత్వం ఆదుకోవాలని అలాగే గాయాలతో వివిధ వైద్యశాల ల్లో చికిత్స పొందుతున్న కూలీల కు ప్రభుత్వం వైద్య సాయం అందించాలని క్షతగాత్రుల కు 2. లక్షల రూపాయలు ఆర్థిక సహకారం అందించాలని సైదా ప్రభుత్వాన్ని కోరారు. రోడ్డు ప్రమాదాల రూపంలో చితికి పోతున్నాయనీ అలాంటి కుటుంబాలను ఆదుకోవలసిన కనీస ధర్మం ప్రభుత్వానిదే! అని సైదా అన్నారు.

# ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలాలు వినియోగంలోకి తేవాలి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 17)**

మండలంలోని తిమ్మపాలెం పంచాయతీలోని మూలెవారిపాలెం గ్రామంలో కొందరు ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని తిమ్మపాలెం గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వి.పుల్లారావుకు వినతి పత్రం అందజేసి విన్నవించారు. ఈ మేరకు గ్రామస్తులు మాట్లాడుతూ మూలేవారిపాలెం బీసీ కాలనీలో ఇటీవల చేసిన ప్లాట్లను అనుకుని ఉన్న స్థలాలను కొందరు అక్రమార్కులు స్వాధీనం చేసుకొని పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. ఆ ఆక్రమణలు తొలగించి ఆ స్థలాలను అంగన్వాడీ కేంద్రం లేదా పశు వైద్యశాల కోసం వినియోగించాలని విన్నవించారు. ఈ ఘటనపై తాసిల్దార్ విచారించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోరబోయిన మాల్యాద్రి, రామనబోయిన తిరుపాలు, ముచ్చు మాల్యాద్రి, ముచ్చు ఆదెయ్య, గెట్టిబోయిన మల్లికార్జున యాదవ్ తదితరులు ఉన్నారు.

# తవనం చెంచయ్య వర్ధంతి సందర్భంగా సెమినార్ జయప్రదం చేయండి

**జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)**

ప్రకాశం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపక నేత, ప్రజా పోరాట యోధులు తవనం చెంచయ్య 11వ వర్ధంతి సందర్భంగా జరుగుతున్న సెమినార్ ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సంపన్నులకు వరాలు చూపి, సామాన్యులపై భారాలను మోపిందని అన్నారు. ఆ అంశాలను చర్చ చేసి బడ్జెట్లో గ్రామీణ పేదలకు నిధులు పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు ఈ సెమినార్ నిర్వహిస్తున్నామని అన్నారు. " కేంద్ర బడ్జెట్ గ్రామీణ పేదలపై ప్రభావం " అనే అంశం మీద ఈ నెల 22వ తేదీన ఎల్బీజీ భవన్ లో ఉదయం 10:30 నుండి సెమినార్ జరుగుతుందని తెలిపారు. ఈ సెమినార్ కు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు ప్రధాన వక్తగా హాజరవుతున్నారని, వారితోపాటు సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్. కే. మాబు తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సెమినార్ లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పూసా వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య పాల్గొన్నారు.



# చేనేత కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి అధికారులు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 17)

చేనేత కుటుంబాల జీవన స్థితిగతులను మెరుగుపరుచుటకు తీసుకోవలసిన చర్యల పై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముద్ర పథకం కింద చేనేత కుటుంబాలకు చేయూత అందించేందుకు 1,044 మందికి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు 76 మందికి మాత్రమే ఆయా బ్యాంకుల ద్వారా రుణాలు అందాయని తెలిపారు. 245 మందికి రుణాలు మంజూరైనాయని అన్నారు. జిల్లాలో మండలాల వారీగా చేనేత కుటుంబాల సర్వే జరిగిందన్నారు. జిల్లాలో 7794 చేనేత కుటుంబాలు ఉండగా అందులో 7217 కుటుంబాలు యాక్టివ్ గాను 581 కుటుంబాలు ఇనాక్టివ్‌గా ఉన్నాయని సర్వే నివేదిక ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కుటుంబాలు 18 బ్యాంకుల పరిధిలోకి వస్తాయని ఎల్‌డిఎం జిల్లా కలెక్టర్ కు వివరించారు. 18 బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లకు, గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు, చేనేత జౌళి సహాయ సంచాలకులకు సర్వే రిపోర్ట్ ను అందజే యాలని డిఎల్‌డివో అధికారులను ఆయన ఆదేశించారు. సర్వే నివేదిక ప్రకారం ఈ రోజు నుండి బ్యాంకు అధికారులు రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. రుణాలు మంజూరు లో ఆయా చేనేత కుటుంబాలను తనిఖీ చేసినప్పుడు అక్కడ మగ్గాలు లేవని ఎల్‌డిఎం కలెక్టర్‌కు వివరించారు. మగ్గాలు లేని కుటుంబాలు చేనేతకు సంబంధించి ఇతర వృత్తిలో ఉన్నారో తెలుసుకొని వారికి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ తెలిపారు. రుణాలు మంజూరు చేయుటకు మార్జిన్ మనీ రూ.25 వేలు ముందుగా కట్టాలని, కడితే గాని రుణాలు మంజూరు చేయడం లేదని, సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నందున రుణాలు ఇవ్వడం లేదని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు కలెక్టర్ కు వివరించారు. జిల్లాలో చీరాల, వేటపాలెం, భట్టిప్రోలు, చెరుకూరు, రేపల్లె, మార్టూరు మండలాల లో నేత కార్మికుల కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని సర్వే రిపోర్ట్ తెలుపుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ 6 మండలాలలోని చేనేత కుటుంబాలను చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు, ఎల్‌డిఎం కలసి వ్యక్తిగతంగా వెళ్లి వారితో చర్చించి రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సిబిల్ స్కోర్ తక్కువగా ఉండి రుణాలు మంజూరు కానటువంటి కుటుంబాలను గుర్తించి వారికి శ్రీనిధి కింద రూ. 50 వేల నుండి రూ.60 వేల వరకు రుణాలు మంజూరు చేయుటకు చర్యలు తీసుకోవాలని గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కు కలెక్టర్ సూచించారు. నూరు శాతం చేనేత కుటుంబాలకు రుణాలు మంజూరు చేయుటకు క్షేత్రస్థాయిలో ప్రక్రియ సమర్థంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. చేనేతలకు మేలు చేయడమే లక్ష్యంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచనలు చేశారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు నాగమల్లేశ్వరరావు, ఎల్‌డిఎం శివకృష్ణ, డిఆర్‌డిఏ పిడి పద్మ, బాపట్ల డిఎల్‌డిఓ సిహెచ్ విజయలక్ష్మి, చీరాల డి ఎల్‌డిఓ పద్మావతి పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 17)

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్లో పనిచేస్తున్న అంగనవాడి వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ రేపు రాబోయే శాసనసభ సమావేశాల్లో తీర్మానం చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మెమోరండంనీ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్ డి యాసీన్, అంగన్వాడి కార్యకర్తలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్,ఏఐటియుసి నాయకులు ఎస్కే కాసిం పీరా,ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కనిగిరి ప్రాంత కన్వీనర్ వై శైలజ, సీనియర్ నాయకులు కే .కుమారి, డి .దీపిక ,కే .పద్మ ఎస్ కె జులేఖ, ఆర్ దుర్గా, సిహెచ్ స్వాతి, కే దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికుల చేతనే పనులు చేయించాలి

## అర్ధవీడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు నన్నే బోయిన రవికుమార్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులను కాంట్రాక్టర్ ద్వారా చేసే విధానాలను ఆపి పంచాయతీ తీర్మాణాలు చేసిన చోట నుండి ఉపాధి హామీ కార్మికుల చేతనే పనులు చేయించాలని అర్ధవీడు మాజీ జడ్పిటిసి వైఎస్ఆర్ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు నన్నే బోయిన రవికుమార్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న సందర్భంగా ఉపాధి హామీ పనులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును వారు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ కి అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించాలని ప్రయత్నం చేస్తుందని దానిని ముందుగానే పంచాయతీ తీర్మానాలు మండల పరిషత్ తీర్మానాలు జడ్పి తీర్మానం అయిన చోట తప్పనిసరిగా కాంట్రాక్టర్ కాకుండా ప్రజల చేతనే పనులు చేయించాలని హైకోర్టు తీర్పునివ్వడం జరిగిందని ఆ తీర్పుని అమలు చేయమని కలెక్టర్ కోరామని వారన్నారు. పేదలకు ఉపాధి హామీ పథకం వరము లాంటిదని వందరోజుల పని కల్పించి ఎంతో ఆదుకుంటున్న ఈ పథకాన్ని నీరుగార్చకుండా ఉండాలని ఉద్దేశంతో తమకు అర్జీ నివేదిక ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేస్తవారిపేట జడ్పిటిసి బండ్లమూడి వెంకటరావు మైనార్టీ నాయకులు ఖాదరవలి ఆర్ రమేష్ రెడ్డి ఉన్నారు.

# పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో 52వ డివిజన్ వైసీపీ నాయకులు భేటి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 17)

నెల్లూరు రాంజీ నగర్ వైసీపీ నగర కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని 53 డివిజన్ వైఎస్ఆర్సిపి నాయకులు వెంగళ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డితో వారు డివిజన్ సమస్యలపై చర్చించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా పని చేస్తామని తెలిపారు.





# ఫలించిన దళిత నేత నీలం నాగేంద్రరావు ఐదేళ్ళ కృషి

### చింతగుంట్ల జీవన్ హత్య కేసులో భార్య జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం

### – మంత్లీ పెన్షన్ రూ.8.25 లక్షల రిలీఫ్ – ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)



హత్యే జరగలేదన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు కట్టారు. ట్రైనీ ఎస్పీనే ఇన్వెస్టిగేట్ చేశారు. నిందితుల్ని అరెస్టు చేయాలని హతుడి భార్య బిడ్డలు, దళిత నేత నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో ఎస్పీ, కలెక్టర్ ఆఫీసుల ముందు చేసిన ధర్నాలది కూడా రికార్డే. దళితుల హత్య కేసుల్లో జీవన్ హంతకుల కోసం జరిగినన్ని ఆందోళనలు మరే కేసు కోసం జరగలేదు. అయినా పోలీసులు హంతకుల్ని అరెస్టు చెయ్యలేక పొయ్యారు. కాదు కాదు పోలీసులు హంతకుల్ని అరెస్టు చేయకుండా రాజకీయ నాయకులు అడ్డుపడ్డారు. దళిత నేత నీలం నాగేంద్రరావు పట్టు వదలని విక్రమార్కుడిలా జీవన్ హత్య కేసు భుజానికెత్తుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐదేళ్లపాటు వందలసార్లు ఎస్పీలను కలెక్టర్లను కలిశారు. చివరకు పోలీసులు హంతకులను పట్టుకోలేమని తేల్చి, కేసును అన్ డిటెక్ట్ చేశారు. అన్ డిటెక్ట్ కేసుల్లో సైతం బాధితులకు రిలీఫ్ మరియు రిహాబిలిటేషన్ కల్పించాలన్న ప్రభుత్వ ఉత్తర్వులను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జీవన్ భార్య జ్యోతి ఇద్దరు పసిబిడ్డలకు కలెక్టర్ రిలీఫ్ మంజూరు చేస్తారానంగా, మళ్లీ ఒక ట్విస్టు. జీవన్ తల్లి జీవన్ భార్యకు బిడ్డలకు రిలీఫ్ ఇవ్వొద్దన్నారని సంతనూతలపాడు తహసిల్దారు కలెక్టర్కు రిపోర్ట్ రాశారు. ఈ క్రమంలో రెండు సంవత్సరాల పాటు రిలీఫ్ ఆగిపోయింది. అయినా నీలం నాగేంద్రరావు మొండిగా పట్టుబట్టి అధికారులకు రూల్ పోసిషన్ చెప్పి జీవన్ భార్య బిడ్డలకు రిలీఫ్ వచ్చేలా చేశారు. ఐదేళ్ళ పోరాటం సుఖాంతమయ్యింది. ఒంగోలు కార్పోరేషన్ శివారు పేర్ణమిట్టలో 2020 జనవరి 25 న హత్యకు గురైన చింతగుంట్ల జీవన్ హత్య కేసులో భార్య జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం, మంత్లీ పెన్షన్, 8.25 లక్షల రూపాయల రిలీఫ్ మంజూరు చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఒంగోలులోని తన కార్యాలయంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ, పేర్నమెట్టకు చెందిన రెడ్డి కులస్తులు ఎస్సీ మాల కులానికి చెందిన చింతకుంట్ల జీవన్ను అక్రమ సంబంధం పెట్టుకున్నాడని హత్య చేశారన్నారు. ఒంగోలు తాలూకా పోలీసులు జీవన్ హత్యను మొదట అనుమానాస్పద మృతి కింద, క్రైమ్ నెంబర్ 33/2020 గా కేసు నమోదు చేశారన్నారు. హతుడు జీవన్ ఎస్సీ కావడం, పోస్టుమార్టం రిపోర్టులో మరణ కారణం హత్య అని తేలడంతో, అనుమానాస్పద మృతిని హత్య కేసుగా మార్చారన్నారు. ట్రైనీ ఎస్పీ జగదీష్ జీవన్ హత్య కేసు విచారించారన్నారు. నిందితుల్ని పోలీసులు అరెస్టు చేయకుండా వైసీపీ నాయకులు అడ్డు పడ్డారన్నారు. ఈ క్రమంలో దళితులను హత్య చేసిన హంతకుల అరెస్టు కోసం జరిగిన ఆందోళనల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఎస్పీ కలెక్టర్ కార్యాలయం ముందు రికార్డు స్థాయిలో ఆందోళనలు చేశామన్నారు. పోలీసులు ఈ కేసును నీరు గార్చేందుకు, జీవన్ మద్యం తాగి, నీరు లేక గొంతు ఎండి మరణించాడని, ముఖాన్ని జంతువులు చీల్చాయని ఖాకీ కట్టుకథ అల్లారన్నారు. తమ ఆందోళన ఫలితంగా మరణ కారణం మార్చే సాహసం చేయలేకపోయారన్నారు. తమ ఆందోళన ఫలితంగా, హత్య కేసుగా మార్చారని, కానీ హంతకులను మాత్రం పట్టుకోలేక చేతులెత్తేసారన్నారు. హత్య జరిగిన మూడేళ్ల తర్వాత సాంకేతికంగా కేసును అన్ డిటెక్ట్ చేశారన్నారు. హంతకులను గుర్తించలేని అన్ డిటెక్ట్ ఎస్సీ ఎస్టీ హత్య కేసుల్లో బాధితులకు రిలీఫ్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ కు ఇచ్చానన్నారు. కలెక్టర్ బాధితులకు రిలీఫ్ మంజూరు చేసే సమయంలో, జీవన్ తల్లి లుదియమ్మ జీవన్ బార్యా బిడ్డలకు రిలీఫ్ ఇవ్వొద్దన్నారని సంతనూతలపాడు తహసిల్దార్ కలెక్టర్కు రిపోర్ట్ పంపారు. దీంతో రిలీఫ్ సుమారు రెండేళ్లు నిలిచిపోయింది. ఈ దశలో నాగేంద్ర ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రిలీఫ్ ఇచ్చేందుకు ఉన్న రూల్స్ చూపి, జీవన్ భార్యాబిడ్డలకు ఐదు సంవత్సరాలుగా రిలీఫ్ రాలేదని, జీవన్ భార్యాభర్తలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఫైల్ సర్కులేట్ చేయమని ఆదేశించారు. చింతకుంట్ల జ్యోతి కి ప్రభుత్వ ఉద్యోగం, ప్రతినెల డిఏ తో కూడిన 5000 రూపాయల మంత్లీ స్పెషల్ పెన్షన్, 8 లక్షల 25 వేల రూపాయలు నగదు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలులో అధికారుల వివక్ష, నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యాలకు నిదర్శనంగా చింతగుంట్ల జీవన్ హత్య కేసు చరిత్రలో నిలిచిపోతుందని నాగేంద్ర తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, దుగ్గిరాల విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

## బాపట్ల ఎమ్మెల్యే వేగేశన





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 17)

ఉమ్మడి గుంటూరు – కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో సోమవారం బాపట్ల నియోజకవర్గం బాపట్ల పట్టణంలోని భీమావారి పాలెం పార్క్ దగ్గర నుంచి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు రూపానందరెడ్డి,బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి , బాపట్ల జిల్లా భావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,బిజెపి పట్టణ అధ్యక్షులు బ్రంహాణం బాల నారాయణ, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు,కార్యకర్తలకు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ వర్కర్స్ మినిట్స్ కాపీలకు జీవోలు ఇవ్వాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)

అంగన్వాడి వర్కర్స్ గత సమ్మెలో ఇచ్చిన మినిట్స్ కాపీలుకు జీవోలు ఇవ్వాలని, ఒంగోలు ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. స్థానిక ఒంగోలు ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్స్ నిరసన ధర్నా చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లాఉపాధ్యక్షులు పి. కల్పన మాట్లాడుతూ గతంలో సమ్మె సందర్భంగా 42 రోజులు పాటు అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మె పోరాటం చేశారు . అంగన్వాడి వర్కర్స్ కు సమ్మె కాలంలో సమస్యలు పరిష్కారం చేస్తున్నామని హామీ ఇచ్చారు, వాటికి జీవోలు ఇవ్వాలని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్స్ నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడికి ఇచ్చిన హామీలను సమ్మెకాలంలో మినిట్స్ కాపీలకు జీవోలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ అతి తక్కువ వేతనాలతోటి జీవనం కొనసాగిస్తున్నారు గతంలో 2019 సంవత్సరంలో అంగన్వాడి వర్కర్స్ కు అప్పుడు ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచారు ఇప్పుడు నిత్యవసర ధరలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి కార్మికులకు వేతనాలు పెంచడంలో ప్రభుత్వాలు మేన మీసాలు లెక్కేస్తున్నారు. అంగన్వాడీ వర్కర్స్ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మరియు కనీస వేతనాలు 26,000 ఇవ్వాలి, గ్రాడ్యుటీ అమలు చేయాలి, మినీ సెంట్రల్ మెయిన్ సెంట్రల్ గా మార్పు చేయాలని ,వాటికి వెంటనే జీవోలు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న సెంటర్లో మధ్యలో డి.ఏలుబిల్లులు వెంటనే ఇవ్వాలని .అన్ని యాప్లు రద్దుచేసి ఒకే యాప్ మార్పు చేయాలని. మేనేజర్ చార్జీలు పెంచాలని. రాష్ట్ర ప్రభుత్వ అంగన్వాడి సెంటర్ కు ఉచితంగా గ్యాస్ సర్ఫర్ చేయాలని .వేతనంతో కూడిన మెడికల్ లీవ్వులు కనీసం మూడు నెలలు ఇవ్వాలని అంగన్వాడి వర్కర్స్ కు సంక్షేమ పథకాలు అమలు చేయాలని .సర్వీస్ లో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు 20 వేల రూపాయలు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సమ్మెలో చనిపోయిన కార్మికుల కుటుంబాల్ని ఆదుకోవాలని తదితరు అంగన్వాడి డిమాండ్లు, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని పక్షంలో రేపు జరిగే .రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడి వర్కర్స్ నిధులు కేటాయించాలని వారికి వేతనాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళన పోరాటం కార్మిక వర్గం కలిసి పోరాడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె .స్వామి రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి కార్మికులకు పై పనివారాన్ని తగ్గించాలని ,ప్రమోషన్లు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న తదితర సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కారం చేయాలని కార్మికుల పక్షాన ప్రభుత్వం ఉండాలని అన్నారు . అనంతరం జిల్లా పిడి బి హేన సుజన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఒంగోలు నగర ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఏ పద్మ, కె ఎమిమా, నాయకులు కే వి సుబ్బమ్మ, నిర్మల ,పద్మ, శేషమ్మ ,సంధ్య ,జ్యోతి రాజేశ్వరి, శోభ, శ్రీదేవి, గౌసియ్య, కవిత, స్టిల్, జయశ్రీ పాల్గొన్నారు.



# బాధితులకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలి



## నష్టపరిహారం చెల్లించకుండా రైల్వే లైన్ నిర్మాణంకు పూనుకోవడం ఏమిటి ?

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 17)

నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో కనిగిరి మండలం పేరంగుడిపల్లి బాధితులు ఏడుగురికి నష్టపరిహారం చెల్లించకుండా రైల్వే లైన్ నిర్మాణంకు పూనుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, బాధితులైన గృహస్థులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని నేడు బాధితులతో కనిగిరి ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. సిపిఎం జిల్లా నాయకులు పివి శేషయ్య మాట్లాడుతూ ప్రస్తుత రైల్వే లైన్ బాధితులకు ప్రభుత్వం 1999 , 2014లో ఇంటి పట్టాలు మంజూరు చేయడం జరిగిందని, ఇద్దరు ఇండ్లా సరస్వతి, అంబటి వెంకటయ్య ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇంటి నిర్మాణం చేసుకున్నారని, మిగిలిన ఐదుగురు అంబటి వెంకటేశ్వర్లు, అంబటి నాగరాజు, ఇండ్ల శ్రీహరి ,ఇండ్ల శ్రీనివాసులు,ఇండ్ల మాలకొండయ్య సొంత నిధులతో ఇల్లు నిర్మించుకోవడం జరిగిందన్నారు. ఏడుగురు బాధితులు ఇంటి పన్నును చెల్లిస్తూ, గృహాలకు కరెంటును వినియోగించుకొని నెలవారి బిల్లులు చెల్లిస్తున్నారు. రైల్వే లైన్ నిర్మాణం పనులు ప్రారంభించిన నాటినుండి బాధితులు 2011, 2018, 2024 లో మొత్తం17 సార్లు కలెక్టర్ మరియు ఆర్డీవో లను కలిసి అర్జీలు అందజేసి పరిహారాన్ని కోరడం జరిగిందన్నారు. రైల్వే నిర్మాణ పనులలో పురోగతిని చూసేందుకు 25.9.2024న పేరంగుడిపల్లి గ్రామానికి కలెక్టర్ స్వయంగా రావడం జరిగింది. ఈ సందర్భంగా రైల్వే లైన్ బాధితులు తమకు నష్టపరిహారం అందని విషయాన్ని తెలియజేస్తూ, సత్వరమే పరిహారం అందించేందుకు తోడ్పడమని కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చి కోరడం కూడా జరిగింది. అయినప్పటికీ పరిహారము చెల్లింపులకు సంబంధించి జాప్యం జరుగుతూనే ఉంది. బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అధికారులు మాత్రం ప్రస్తుతం ఉన్న యిండ్లకు ప్రత్యామ్నాయంగా ఇళ్లపట్టాలిస్తామని, ప్రభుత్వం చేత పక్కా గృహాలు మంజూరు చేయిస్తాము కనుక ఇండ్ల నిర్మాణం మీరే చేసుకోవాలని వాదనలు వినిపిస్తున్నారు. ప్రభుత్వం పక్కా గృహాలకు మంజూరు చేసిన నిధులతో నిరుపేదలు గృహ నిర్మాణం పూర్తి చేసుకోవడం ఎలా సాధ్యమని బాధితులు ప్రశ్నించారు.అన్ని ప్రాంతాల్లో పొలాలకి, భూమిలోని చెట్లకు, బోర్లకు పరిహారం ఇచ్చిన ప్రభుత్వం, 25 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారి గృహాలకు పరిహారం చెల్లించకపోవడం ఏమిటని, ఇది ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం కాదా అని సిపిఎం జిల్లా నాయకులు పివి శేషయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు ఆర్డీవోను, కనిగిరి ఎమ్మార్వో గారిని ప్రశ్నించడం జరిగింది. ఇప్పుడు బాధితుల ఇండ్ల వరకు రైల్వే లైన్ కట్టకు సంబంధించినటువంటి నిర్మాణం చేపట్టి, మీరు తక్షణం యిళ్లు ఖాళీ చేయాల్సిందే, పరిహారంతో మాకు సంబంధం లేదంటూ రైల్వే కాంట్రాక్టర్ కు సంబంధించిన మనుషులు తీవ్ర వత్తిళ్ళకు, బెదిరింపులకు పూనుకున్నారు. ఉన్నఫలంగా యిండ్లు ఖాళీ చేయాలని, లేనిచో మీ ఇళ్లను మేమే నేలమట్టం చేస్తామని చెబుతున్నారు. 25 ఏళ్లుగా నివాసం ఉంటున్నవారిని, హక్కుదారులను ఉన్నఫలంగా ఖాళీ చేయమని దబాయించడం ఏమిటి? ఖాళీ చేసిన బాధితులులు ఎక్కడికి వెళ్లాలి. ఎక్కడ నివాసం ఉండాలి . కనీసం మానవతా విలువలను వదిలేసి బాధితులను నిర్లక్ష్యానికి గురి చేయడం ఏమిటి అని బాధితులు సూటిగా ప్రశ్నించారు. దీనితో ఆర్డీవో మరియు ఎంఆర్ఓ రైల్వే లైన్ ప్రాంతంలో ఉన్న మీ నివాస గృహాలకు వచ్చి, స్వయంగా పరిశీలన చేసి సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. సమస్య తక్షణ పరిష్కారానికి జిల్లా కలెక్టర్, సత్వరమే చర్యలు తీసుకోవాలని పివి శేషయ్య, బడుగు వెంకటేశ్వర్లు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు జడ్పిటిసి ఎం కస్తూరి రెడ్డి, గ్రామ సర్పంచ్ ఇండ్ల సుజాత, ఇండ్ల మాలకొండ రాయుడు, ఇండ్ల వెంకటేశ్వర్లు, వెలుగు వెంకటేశ్వర్లు, ఇండ్ల ఓంకార్, ఇండ్ల వీరనారాయణ, సిహెచ్ నారాయణ,స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# గులియన్ బ్యార్రి సిండ్రోమ్ వ్యాధిపై అవగాహన కల్పించాలి

### - అభా కార్డుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 17)



ప్రాణాంతకమైన గులియన్ బ్యార్రి సింద్రోమ్ వ్యాధికి జిల్లా వాసులు గురిగాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలోని విద్యార్థులకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. కోడి పేగులలో ఉండే బ్యాక్టీరియా ద్వారా గులియన్ బ్యార్రి సింద్రోమ్ వ్యాధి మనుషులకు వస్తుందన్నారు. కోడి మాంసం విక్రయించే విక్రయదారులు జాగ్రత్తలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కోడి నుంచి తీసే వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయరాదని, జల వనరులు కలుషితమయ్యే ప్రాంతాలలో వాటిని ఉంచరాదని హెచ్చరించారు. కలుషితమైన తాగునీరు, కలుషితమైన ఆహార పదార్థాలు తీసుకోవడంతోనే వ్యాధి వస్తుందని చెప్పారు. వ్యాధి లక్షణాలు గుర్తించడంపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి సోకినట్లైతే మూడు రోజులపాటు తగ్గకుండా జ్వరం వస్తుందని, తీవ్రమైన నీరసం, డయేరియా, పక్షవాతం, నరాలు సచ్చుపడటం, చేతి వేళ్ళు లేదా కాలు వేళ్ల దగ్గర నుంచి స్పర్శ క్రమేపి కోల్పోవడం వంటివి సంభవిస్తాయన్నారు. లక్షణాలు కనపడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.బ్యాక్టీరియా సోకి వ్యాధిగ్రస్తులైన ప్రభుత్వం ప్రత్యేక వైద్యం అందిస్తుందని కలెక్టర్ చెప్పారు. గుంటూరు జి జి హెచ్ లో ప్రత్యేక కేంద్రం, ప్రకాశం జిల్లా ఒంగోలు రిమ్స్ లో ప్రత్యేక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. బాపట్ల జిల్లాలో ఏ ఒక్కరి ప్రాణానికి హాని కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కోడిలో నుంచి వచ్చే బ్యాక్టీరియా ప్రజలలోకి రాకుండా నివారించడానికి ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. చికెన్ మాంసం 100 డిగ్రీల వేడిమిలో ఉడికించినట్లయితే బ్యాక్టీరియా పూర్తిగా చనిపోతుందనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సరఫరా చేసే తాగునీటిని మరింతగా శుభ్రపరచాలని అధికారులను ఆయన ఆదేశించారు. కలుషితమైన తాగునీరు, ఆహార పదార్థాలు తీసుకోరాదని సూచించారు. బాగా కాచి, వడకట్టిన తాగునీటినే తాగాలని ఆయన చెప్పారు. చెరువులలో తాగునీరు కలుషితం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆయన ఆదేశించారు. అభా కార్డుల నమోదు ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. ఇప్పటివరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 85% సర్వే పూర్తి అయ్యిందన్నారు. వేటపాలెం, కర్లపాలెం, యద్దనపూడి మండలాలలో ఈ ప్రక్రియ జాప్యంపై అరా తీశారు. సత్వరమే నూరు శాతానికి ఈ ప్రక్రియ చేరుకునేలా మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంఈవోలు, వైద్య అధికారులతో బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, అనాధ ఆశ్రమాలలోని విద్యార్థులు, అనాథలకు అభా కార్డుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్ సి డి సి సర్వే వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. చిన్నగంజాం, నిజాంపట్నం, ఇంకొల్లు, జెపంగులూరు మండలాలలో సర్వే వెనుకబాటుపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాపట్ల జిల్లాలో కిడ్నీ డయాలసిస్ కేసులు 1,010 ఉన్నాయన్నారు. డయాలసిస్ కేంద్రం నూతనంగా ఏర్పాటు చేయడానికి తక్షణమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైద్యం ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా, అయితే అధికారులు తమ సేవలు వ్యాప్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, డి సి హెచ్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శేషు కుమార్, డీఈవో పురుషోత్తం, మండలాల నుంచి ఎంపీడీవోలు, ఎంఈవోలు, సిడిపివోలు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శశి కీర్తి జన్మదిన వేడుకలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి..





(షణ్ముఖ వెలుగు, విజయవాడ, ఫిబ్రవరి 17)

అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శశి కీర్తి జన్మదిన వేడుకలు విజయవాడలోనీ ఓ ఫంక్షన్ హాల్ లో రీల్స్ స్టార్స్, ఆర్టిస్టులు, మిత్రులు, సన్ని హితుల మధ్య శనివారం న అట్టహాసంగా జరిగింది. ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు, మాజీ డి ఆర్ యు సి సి మెంబర్ ఎం.ఎన్.రెడ్డి కేక్ కట్ చేయించి, శాలు వాలతో ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శశి కీర్తి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం ఎం ఎన్ రెడ్డి ని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున మెమొంటో తో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో సన్నిహితులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

## ఉలవపాడు ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 17)






అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టాలని ఇచ్చిన పిలుపును ఉలవపాడు ప్రాజెక్టు కార్యాలయం దగ్గర సోమవారం నాడు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో, అంగన్వాడి సమస్యలను మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చిన కూడా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం మీ అధికారులకు వస్తే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేస్తామని వాగ్దానం చేశారని, కానీ అధికారాలకు వచ్చిన తర్వాత తన వాగ్దానాన్ని విస్మరించారని ఆయన అన్నారు. కనీస వే తనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, డ్యూటీ అమలు చేయాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, ఆయన డిమాండ్ చేశారు, సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు వర్తింపజేయాలని, హౌస్ హెూల్డ్ సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా, నీ జీతం 12000 గా నమోదు చేసిన దానిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, ఐదు సంవత్సరంలోపు పిల్లలను విధిగా అంగన్వాడీ సెంటర్ లోనే ఉంచాలని జీవో ఇవ్వాలని, ఉచితంగా గ్యాస్ ఇవ్వాలని, ఆయాల ప్రమోషన్లలో రాజకీయాలు తగదని, అన్ని యాప్ లు కలిపి ఒకే యాప్ గా ఉండాలని, మట్టి ఖర్చులకు 20 వేల రూపాయలు ఇవ్వాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని, సిడిపిఓ కార్యాలయంలో ఉన్న సూపర్వైజర్ పూజల నాగలక్ష్మి కి అందజేయడమైనది. ఈ ధర్నా కార్యక్రమంలో, %ఎఔబ% జిల్లా నాయకులు జి వి బి కుమార్, ప్రాజెక్టు లీడర్, ఇందిరావతి, సిఐటియు గుడ్లూరు మండల కార్యదర్శి కొట్టే వెంకయ్య, తదితరులు మాట్లాడారు. ప్రజానాట్యమండలి గాయకుడు పాలకుర్తి నాగేశ్వరరావు విప్లవ గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్లు, ఎస్కే పద్మజ, సిహెచ్ పద్మజ, అమర గీత, చీడితోటి ప్రభావతి, మాధవి, నిర్మల, గీత, తిరుపతమ్మ, సుగుణ, బుజ్జమ్మ, కుమారి, శ్రీదేవి, శేషమ్మ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.



## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మార్కాపురం జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 17)

మార్కాపురం నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొందిలి కాశీరామ్ సింగ్, జనసేన నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు, విజయరావు నరసింహారావు, పిన్నెబోయిన శ్రీనివాసులు, జిల్లా లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ ఐ శైలజ, బెల్లంకొండ గోపి, పిచ్చయ్య, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్లో పేర్లు నమోదు చేసుకోవాలి

### ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్ రైతు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన జేడీ శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 17)

కంభాలపాడులో సోమవారం సాయంత్రం ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతులు పేర్లు నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి రైతుకూ ఒక గుర్తింపు విశిష్ట సంఖ్యను ఇవ్వాలని నిర్ణయించిందని, ఇందులో భాగంగా గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా సెటిల్ మెంట్ (అసైన్డ్, డీకే భూమి కాకుండా) భూమి కల్గిన రైతులు ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్ నందు వెంటనే తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లు నమోదు చేసుకోవడం వలన రైతలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయాన్నారు. పొదిలి మండల వ్యవసాయాధికారి షేక్ జైన్‌లుద్దీన్ మాట్లాడుతూ రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకొని రావాలన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ బెల్లం కొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పేర్లు నమోదు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కల్లూరి రవికుమార్‌రెడ్డి, విలేజ్ వ్యవసాయ సహాయకురాలు సునీత, నేచురల్ పార్మింగ్ యూనిట్ ఇంచార్జి నాగినేని వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని పేర్లు నమోదు చేసుకున్నారు.

## అర్జీలను సునిశిత పరిశీలన చేసి పరిష్కరించాలి


### జిల్లా జాయింట్ కలెక్టర్ కె కార్తీక్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 17)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను సునిశిత పరిశీలన చేసి పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అధికారులకు సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ తో పాటు డిఆర్వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సిఇవో విద్యారమ, డి ఆర్ డి ఎ పిడి నాగరాజ కుమారి, డిపిఒ శ్రీధర్ రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా అర్జీల పరిష్కారానికి వాటిపై సునిశిత పరిశీలన అవసరమన్నారు. వచ్చిన అర్జీలలో రెవెన్యూ పరమైన అంశాలు అర్జీలు ఎక్కువగా ఉంటున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలన్నారు. పి జి ఆర్ ఎస్ అర్జీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినందున అధికారులు సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మొత్తం 472 అర్జీలు**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 172, మున్సిపల్‌శాఖకు సంబంధించి 48, పోలీసు శాఖకు సంబంధించి 60 , సర్వే 72 పంచాయతీరాజ్‌శాఖ 29 కాగా మిగిలినవి ఇతర విభాగాలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



# పశ్చిమ ప్రకాశంలో కరవు ఛాయలు

- కృష్ణా జలాలే శరణ్యం

**వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు తక్షణం రూ 2 వేల కోట్లు కేటాయించాలి**

**సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్**

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 17)**

వర్షాధారం తప్ప మరో నీటి ప్రత్యామ్నాయం లేని పశ్చిమ ప్రకాశంలో కరవు ఛాయలు అలముకున్నాయని, ఈ ప్రాంత శాశ్వత పరిష్కారానికి కృష్ణ జలాలే శరణ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి వచ్చే బడ్జెట్లో తక్షణం రూ. 2 వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా పశ్చిమ ప్రకాశం నోచుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజానీకానికి వరప్రసాదమైన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి వచ్చే బడ్జెట్లో రూ 2000 కోట్ల నిధులను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే వెలిగొండ ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యత నిస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం దాన్ని ఆచరణలో చేసి చూపించాలని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 29 సంవత్సరాలు అవుతున్నప్పటికీ నేటికీ నిర్మాణ పనులు పూర్తికాకపోవడం ఆందోళనకరమని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పై పాలకవర్గాలకు చిత్తశుద్ధి ఏమాత్రం లేదని, కేవలం ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మాత్రమే ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడడం అధికారంలోకి వచ్చిన తర్వాత మరచిపోవడం అలవాటుగా మారిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల ప్రజల సమస్యలను నేటికీ పట్టించుకోకపోవడం దారుణమని పాలకవర్గం పనితీరును ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకపోవడం చాలా బాధగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొనడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. గత 29 సంవత్సరాల క్రితం నేటి ముఖ్యమంత్రి నాడు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. నిధులు కేటాయించకుండా కాలక్షేపం కోసం అధికారులతో సమావేశాలు పెట్టడం వృధా అని ఆయన అన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉందని, దీని ఫలితంగా బాల్య దశలోనే చిన్నారులు వృద్ధులుగా మారిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి అయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలోని 32 మండలాల్లో 4 లక్షల 32 వేల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మందికి డ్రింకింగ్ వాటర్ అందుబాటులోకి వస్తుందని అన్నారు. అలాగే ఈ ప్రాంతమంతా పాడిపంటలతో సస్యశ్యామలంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం అనేక దశాబ్దాలుగా సిపిఐ రాజీలేని పోరాటాలను కొనసాగిస్తుందని ఆయన మరోసారి గుర్తు చేశారు. కృష్ణా జలాలను ఈ ప్రాంత ప్రజలకు అందించేంతవరకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి హనుమారెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే తమ సంక్షేమం అని పదే పదే ప్రకటించే పాలకవర్గం ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పాలకవర్గ విధానాల ఫలితంగా రైతులు వ్యవసాయ కూలీలుగా మారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడు లేని విధంగా మిర్చి ధర గణనీయంగా పడిపోయిందని, దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పంట కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక రైతులు తల్లడిల్లి పోతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.హనుమా రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పై సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి అందే నాసరయ్య, పార్టీ జిల్లా నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖాశీం, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు బాణాల రామయ్య, గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి డాక పుల్లయ్య, మార్కాపురం నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు పి కొండయ్య, పట్టణ సిపిఐ కార్యదర్శి చిత్తారి పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.






## పథకాల రాయితీలు పొందాలంటే 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి







**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఫిబ్రవరి 17)**

మండలంలోని రైతు సోదరులనుద్దేశించి మండల వ్యవసాయ అధికారి కే బుజ్జి బాయి 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి పలు విషయాలను వివరించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందించనుంది. పొలము ఉన్న ప్రతి రైతు కూడా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు రాయితీలు పొందాలంటే ఈ 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా నమోదు చేపించుకోవాలన్నారు. రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం.ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమమని తెలిపార. అదేవిధంగా దేవరాజు గట్టు, పెద్దారవీడు, పుచ్చకాయ పల్లిలో మండల వ్యవసాయ అధికారిని సందర్శించి రైతులకి వివరించారు.

## గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 17)**

నెల్లూరు బాలాజీ నగర్ 13వ డివిజన్‌లో కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున ఆధ్వర్యంలో గృహప్రవేశ కార్యక్రమాలకు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై, పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నూతనంగా గృహప్రవేశం చేసిన దంపతులకు చంద్రశేఖర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)** ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టర్ ఆఫీస్‌లో స్పందన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రైతుల పొలం సమస్యల తరపున (ఆన్‌లైన్ జీరోకాటా ల్యాండ్, ఇనాం, మాన్యం ల్యాండ్స్) ఇంకా ఎన్నో సంవత్సరాల నుండి పెండింగ్ వున్న ఇతర భూమి సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా టీడీపీ నాయకులు పెండ్యాల శ్రీనివాస్ చౌదరి జిల్లా రెవెన్యూ అధికారి బిసిహెచ్ ఓబులేసు, ఆర్డిఓ ప్రసన్న లక్ష్మిని కలిసి అర్జీ ఇచ్చారు. వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు.

## పట్టాభిరామస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన టిడిపి, జనసేన నాయకులు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 17)**

పొదిలి పట్టణంలోని గుద్దేటి వారి వీధిలో వెలిసిన పట్టాభిరామ స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యదర్శి గునుపూడి భాస్కర్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, జనసేన పొదిలి మండల నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి వారికి స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు.





## మామిడి పంటపై జిల్లా స్థాయి క్రాప్ సెమినార్



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 17)**

మామిడి పంట పై కేవీకే, కందుకూరులో ఈ నెల 21వ తేదీ న జిల్లా స్థాయి క్రాప్ సెమినార్ జరుగుతుంది. ఈ సెమినార్‌లో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పాల్గొని మామిడి సాగు, పురుగులు, తెగుళ్ళపైన రైతులకు శిక్షణ ఇస్తారు. మామిడి కోత అనంతరం చేపట్టవలసిన జాగ్రత్తలు, మార్కెటింగ్ అవకాశాల గురించి తెలియజేస్తారు. రైతులు తప్పకుండా ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా తెలిపారు.

# సఖి వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించిన బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి

**- బాధిత మహిళల రక్షణ, వారి సమస్యల పరిస్కారం కోసం అందుబాటులో ఉంటాం - జిల్లా ఎస్పీ తుషార్ డూడి**

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 17)**

అతివలకు అండగా "సఖి వన్ స్టాప్ సెంటర్" ఉంటుందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. బాపట్ల పట్టణంలో ఉప్పరపాలెం గేట్ సమీపంలో ఉన్న సఖి వన్ స్టాప్ సెంటర్ ను జిల్లా ఎస్పీ సోమవారం సందర్శించారు. లైంగిక వేధింపులు, గృహ హింస, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, అక్రమ సంబంధాలు, ఈవ్ టీజింగ్, బెదిరింపులు, మహిళల అక్రమ రవాణా, సోషల్ వెబ్సైట్ల ద్వారా జరిపే నేరాలు, మాదకద్రవ్యాలకు లోనై హింసించడం, ఇంటి నుంచి గెంటేయడం, పనిచేసే ప్రదేశంలో మహిళలపై వేధింపులు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులపై మహిళలు నిర్భయంగా 181కు కాల్ చెయ్యవచ్చునని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదు తీవ్రతను బట్టి సఖీ కేంద్రంలో సోషల్ కౌన్సెలర్, లీగల్ కౌన్సెలర్లు కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరం అయితే పోలీసుల సహాయం కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. అతివల సమస్యల సత్వర పరిష్కారానికి, రక్షణ కల్పించేందుకు 2024 సెప్టెంబర్ నెలలో బాపట్ల పట్టణంలో ఉప్పరపాలెం గేట్ సమీపంలో "సఖి వన్ స్టాప్ సెంటర్" ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ఇందులో పోలీసు, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ విభాగాలకు చెందిన సిబ్బంది ఉంటారన్నారు. మహిళలకు ఎటువంటి సహాయం కావాలన్నా సంప్రదించవచ్చునన్నారు. మహిళల ఒంటరిగా ఉండి ఆశ్రయం కావలసి వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 181కు కాల్ చేసి సంప్రదిస్తే తక్షణం "సఖి వన్ స్టాప్ సెంటర్" లో ఆశ్రయం కల్పిస్తారన్నారు. గరిష్టంగా 5 రోజుల వరకు ఆశ్రయం కల్పించడం జరుగుతుందన్నారు. బాపట్ల జిల్లాలో "సఖి వన్ స్టాప్ సెంటర్" ఏర్పాటు చేసినప్పటి నుండి ఇప్పటివరకు 32 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. 18 సంవత్సరాలు లోపు, పైబడిన వారు ఎవరైనా సంప్రదించవచ్చునన్నారు. వారికి ఐదు రోజులు పాటు ఆశ్రయం కల్పించడంతోపాటు భోజనం ఇతర వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. సహాయం కొరకు వచ్చిన బాధిత మహిళలు ఉండేందు ఏర్పాటు చేసిన గదులు, వంటగది, కౌన్సిలింగ్ రూమ్, మెడికల్ చెకప్ రూమ్, స్టాఫ్ రూమ్ లను ఎస్పీ తనిఖీ చేసినారు. రికార్డు లను పరిశీలించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులను గురించి అడిగి తెలుసుకున్నారు. సహాయం కోసం వచ్చిన బాధిత మహిళల సమస్యలు పరిష్కరిస్తున్న విధానం గురించి సిబ్బందిని ప్రశ్నించారు. "సఖి వన్ స్టాప్ సెంటర్" గురించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బాధిత మహిళల ఆశ్రయం కోసం, వారి సమస్య పరిస్కారం కోసం "సఖి వన్ స్టాప్ సెంటర్" ఆశ్రయించినప్పుడు వారి సమస్య తెలుసుకొని వాటిని పరిష్కరించుటకు వ్యవహరించవలసిన విధివిధానాల గురించి సిబ్బందికి పలు సూచనలు చేసినారు. సహృదయభావనతో వ్యవహరిస్తూ బాధిత మహిళలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కరానికి కృషిచెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ ఇన్స్‌పెక్టర్ రాంబాబు, "సఖి వన్ స్టాప్ సెంటర్" అడ్మినిస్ట్రేటర్ ఉషారాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# గిరిజనుల కోసం ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

## - జనసేన పార్టీ నెల్లూరు - జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్




**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 17)**

ప్రతి మండల హెడ్ క్వార్టర్స్‌లో గిరిజనుల కోసం ఆధార్ అప్డేట్ ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జనసేన నాయకులు గునుకుల కిషోర్ అన్నారు. ఆక్వా ఫీడ్ తయారు చేసే కంపెనీల వ్యర్థ్యాలను డైరెక్టుగా మల్దేవిలో కలపటం వలన వేలాది ఎకరాలకు పొలాలకు నీరు అందించే నీరు కలుషితమై విషపూరిత ఆహారం తయారయ్యే ప్రమాదం ఉందన్నారు. జనసేన పార్టీ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌కి వచ్చిన ఫిర్యాదులలో భాగంగా కలెక్టర్ అందుబాటు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్‌కి పై సమస్యల గురించి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం పూర్తిగా పోయేంత వరకు రాజకీయాలు వదిలేదిలేదు అన్న పవన్ కళ్యాణ్ ఆదర్శంగా జనసేన పార్టీ పనిచేస్తుంది. ఎంతోమంది పేదలు ముఖ్యంగా యానాది ఎరుకల కులాలకు సంబంధించి ఎంతోమంది పేదలు ముఖ్యంగా కోవూరు,సర్వేపల్లి నియోజకవర్గాల్లో సంక్షేమ పథకాలకు అర్హులు కాకుండా మిగిలి ఉన్నారని, కొంత వరకు కోవూరు సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేలు స్పందించి కొంత చొరవ తీసుకున్నప్పటికీ, మండల హెడ్ క్వార్టర్స్‌లో నమోదు చేయించుకునే అవకాశాన్ని కల్పించవలసిందిగా కలెక్టర్‌ను కోరారు. కోవూరు నియోజకవర్గంలోని ఆక్వా ఫీడ్ తయారు చేసే కంపెనీలు వాటి లో ఉత్పన్నమయ్యే వ్యర్ధాలను కెమికల్స్ ను డైరెక్టా మల్దేవి కాలువలో వదిలి వేయడం వల్ల వేలాది ఎకరాలకు పంట పొలాలకు అందుతున్న నీరు ఆహార పదార్థాలు విషపూరితం అవుతున్నాయని వీటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. స్టోన్ హౌస్పేటలోని పార్కు విద్యుత్ దీపాలు లేక కొంత నిర్లక్ష్యానికి గురి కావడం వల్ల ఆ అసాంఘిక కార్యక్రమాలకు నెలవగా ఏర్పడింది,పరిశీలించ వలసినదిగా మున్సిపల్ కమిషనర్ దృష్టికి కూడా తీసుకువెళ్తాము అని తెలిపారు. కలువాయి మండలం కుల్లూరు గ్రామం వద్ద అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు శాంక్షన్ అయినప్పటికీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. స్కూలుకు వెళ్లే మార్గం కావడంతో నడిచిపోవడానికి కూడా వీలు లేకుండా గుంతలు ఉన్నాయి, అని కాస్త చినుకు పాడితే ప్రాంతమంతా బురదమయమై పోయి ఇబ్బందిగా ఉందన్నారు. తహసీల్దార్‌ను సంప్రదించినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, పవన్ యాదవ్, కలువాయి మండల నాయకులు మనోహర్, యాసీన్, వశీం, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళల అందుబాటులో ఉంటుంది

## తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురువం బాబు




**(షణ్ముఖ వెలుగు, తిరుపతి, ఫిబ్రవరి 17)**

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఆర్అండ్ బి బంగ్లా నందు సోమవారం తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువం బాబు అధ్యక్షతన సూళ్లూరుపేట నియోజకవర్గం సమన్వయకర్త వెంకటాచలపతి ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో బాలగురువం బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న లేకపోయినా ఎల్లవేళల అందుబాటులో ఉంటుందని తిరుపతి జిల్లాలో ఏ నియోజకవర్గంలో అయినా ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకుని వస్తే ప్రజల తరపున ప్రభుత్వంతో పోరాడుతామని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త వెంకటా చలపతి మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధిపై దృష్టి సారించలేదని ఎద్దేవా చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కలిందర్ మాట్లాడుతూ దేశంలో ఎన్నో రైలు ప్రమాదాలు, భూకంపాలు వచ్చినా దేశ ప్రధాని కనీసం స్పందించడం లేదని అన్నారు. బాలగురువం బాబు, వెంకటాచలపతి సమక్షంలో ఐదుగురు కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. పై కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవాదానం, జిల్లా కార్యదర్శి కత్తి వెంకటేష్, జిల్లా ఓబీసీ చైర్మన్ భాస్కర్ యాదవ్,తడ మండల అధ్యక్షులు శివారెడ్డి, తడ వైస్ ప్రెసిడెంట్ మురళి, సూళ్లూరుపేట టౌన్ ప్రెసిడెంట్ సునీల్ రెడ్డి, సూళ్లూరుపేట మండల అధ్యక్షులు బద్దెపుడి రాజగోపాల్ రెడ్డి, సిహెచ్ సుబ్రహ్మణ్యం, యాసిన్ భాష, సీనియర్ నాయకులు వెంకటరత్నయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సమస్యల పట్ల వేగంగా స్పందించాలి

## ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)**

పోలీస్ స్టేషన్లకు వచ్చే మహిళా పిర్యాదుదారుల పట్ల పాటించవలసిన ప్రవర్తన, ఫిర్యాదుల స్వీకరణ, వాటి సత్వర పరిష్కారంపై మహిళా పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్. మహిళలు, పిల్లలు భద్రతను మరింత బలోపేతం చేయటమే లక్ష్యంగా సోమవారం జిల్లాలోని మహిళా ఎస్సైలు, సిబ్బందితో జిల్లా ఎస్పీ పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పోలీస్ స్టేషన్లకు వచ్చే మహిళా పిర్యాదుదారుల పట్ల పాటించవలసిన ప్రవర్తన, ఫిర్యాదుల స్వీకరణ, వాటి సత్వర పరిష్కారం తదితర అంశాలపై పలు సూచనలు తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్లో ఉమెన్ హెల్ప్ డెస్క్ (మహిళా సహాయక కేంద్రం) వద్ద హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్ ఉండాలని, ఫిర్యాదు చేయటానికి వచ్చే మహిళల పట్ల పోలీసులు గౌరవంగా, మర్యాదగా మాట్లాడాలని, స్నేహపూర్వకంగా ఎలా వ్యవహరించాలో జిల్లా ఎస్పీ సిబ్బందికి సూచించారు. మహిళలను గౌరవంగా సంబోధించే వాతావరణం కల్పించాలని, తద్వారా మహిళలు తమ సమస్యను నిర్భయంగా, ధైర్యంగా చెప్పడానికి అవకాశం ఉంటుందని, వారు చెప్పే వివిధ రకాల సమస్యలను సావధానంగా విని, వాటిని వెంటనే పై అధికారులకు తెలియచేయాలని, మహిళలపై జరిగే నేరాలను అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలని, వారి ఫిర్యాదులను త్వరితగతిన విచారించి తగిన సాక్ష్యాలు సేకరించాలని, వారి ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించి న్యాయం జరిగేలా చూడాలన్నారు.

మహిళల భద్రతే మన లక్ష్యమని, వారి భద్రతకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పని చేయాలన్నారు. బాధితులకు అండగా నిలిచి అవసరమైన అన్ని సేవలు అందించాలన్నారు. 'సఖి వన్ స్టాప్ సెంటర్'లో పోలీసు, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ విభాగాలకు చెందిన సిబ్బంది ఉంటారని, అక్కడ మహిళలకు ఎటువంటి సహాయం కావాలన్నా సంప్రదించవచ్చునన్నారు.

సహాయం కొరకు వచ్చిన బాధిత మహిళలు ఉండేందుకు అన్ని సదుపాయాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డిసిఆర్బి సిఐ దేవ ప్రభాకర్, టౌన్ మహిళా ఎస్ఐలు, రజియా సుల్తాన్, అనిత,సువర్ణ , సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపులు, నిర్వహణ మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు అప్పగించాలి

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 17)**

కూటమి ప్రభుత్వం అప్కాస్ రద్దు పరుస్తూ మున్సిపల్ శాఖనే ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ కార్మికుల బాధ్యత ఉంటుందని స్పష్టంగా ప్రభుత్వం ప్రకటించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ సయ్యద్ యాసిన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా మునిసిపల్ నాయకుడు నాసర్ వలి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు పరుస్తూ మున్సిపల్ శాఖనే ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ కార్మికుల బాధ్యత ఉంటుందని చెప్పినప్పటికీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో అయితే వీటిని ప్రవేట్ వ్యక్తులకు అంటే బడా కంపెనీలకు వారి ఏజెన్సీలకు అప్పజెబుదామనే మంత్రి వర్గ సభ్యుల అభిప్రాయాలు పత్రికల్లో ప్రకటించడం పై ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నదన్నారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 10 వరకు జరగనున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం దృష్టికి కార్మికుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించుకోవడానికి పోరాటాలు చేయడానికి కార్మికుల సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అవుట్సోర్సింగ్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపుకై గత సమ్మెలో నాటి ప్రభుత్వంతో అంగీకారమైన అగ్రిమెంట్ మేరకు వేతనాలు పెంచివ్వాన్నారు. పట్టణ జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచి ఇంజనీరింగ్ ఒప్పంద సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మునిసిపల్ కమీషనర్ డానియల్ జోసేఫ్ కు అందచేశారు. ఈ కార్యాక్రమంలో ఏఐటియుసి నాయకులు ఖాసింవలి, చియాద్రి, అశోక్, ఆలూరి కోటయ్య, గంగవరపు కిరణ్, చింతగుంట్ల శేఖర్, శేషయ్య, సామేలు, మస్తాన్, మధు, ఐజక్, రత్తయ్య, సయ్యద్ తాజుద్దీన్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.




# నిత్యవసర వస్తువుల ధరలను అరికట్టాలి

## ప్రజా విజ్ఞప్తుల వేదికలో ఐద్వా వినతి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)**

పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా ఐద్వా బృందం జాయింట్ కలెక్టర్ కు అర్జీ ఇచ్చిన అనంతరం పత్రికల వారితో రమాదేవి మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జాతీయ కమిటీ పిలుపుమేరకు గత పది రోజులుగా జిల్లాలోని అనేక ప్రాంతాలలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అర్జీలలో సేకరించిన సంతకాలన్నీ రాష్ట్ర గవర్నర్‌కు అందజేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, ఫలితంగానే నిత్యవసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్నాయని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలకు తోడు పెట్రోలియం ఉత్పత్తుల ధరలు కేంద్ర ప్రభుత్వం పెంచటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ భారాలతో జీవితాన్ని గడపడం కష్టంగా మారిందని అన్నారు. కుటుంబంలో ధరల భారాలకు మొదట గురయ్యేది మహిళలేనని అన్నారు. కుటుంబానికి వస్తున్న ఆదాయాలకు, పెరుగుతున్న ధరలకు పొంతన కుదరని సందర్భంలో తగిన పోషకాహారాన్ని మహిళలు పొందలేక అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. రక్తహీనత, గర్భకోశ వ్యాధులు, కాల్షియం లోపంతో ఎముకలు బలహీనంగా వాడటం లాంటి వ్యాధులు పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా కార్పొరేట్ శక్తులు నిత్యావసరాలు అన్నిటిని ముందస్తుగా తక్కువ ధరలకు కొని బ్లాక్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. పండించిన రైతులకు గిట్టుబాటు కాక సామాన్యులకు అందుబాటులో లేక ధరల ప్రభావం ప్రజల మీద తీవ్రమైన ప్రభావం చూపుతోందని ఆమె అన్నారు. బ్లాక్ మార్కెట్ ను అరికట్టి ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం, ధరల నియంత్రణకు కేంద్ర బడ్జెట్లో నిధులు పెంచడం ద్వారా పెరుగుతున్న నియంత్రించాలని, నిత్యవసర వస్తువులన్నీ చౌక ధరలతో దుకానాల ద్వారా అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఒంగోలు నగర అధ్యక్షులు బి గోవిందమ్మ, నగర నాయకురాళ్ళు కే రాజేశ్వరి, బి పెద్ద గోవిందమ్మ పాల్గొన్నారు.

# శ్రీహరికోట పునరావాస బాధితులను ఆదుకోండి

## కాలనీ వాసులకు ఇచ్చిన 10 సెంట్లు నివాస స్థలము, 3 ఎకరాల పొలమును తిరిగి వాళ్లకి ఇప్పించండి

## సిపిఎం జిల్లా సెక్రెటరీ వందవాశు నాగరాజు



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఫిబ్రవరి 17)**

శ్రీహరి కోట పునరావాస బాధితులకు నెమలిమిట్ట అగ్రహారంలో ఇచ్చిన ఇంటి స్థలాలకు రక్షణ కల్పించండి అంటూ సిపిఎం సహకారంతో శ్రీహరికోట కాలనీ వాసులు ర్యాలీగా వెళ్లి రెవెన్యూ డివిజనల్ అధికారికి అర్జీ సమర్పించారు. తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ కేంద్రం కొరకు విక్రమ్ సారాభాయ్ 1970 లో శ్రీహరికోట నుండి రాకెట్లను నింగిలోకి పంపేందుకు అనువుగా ఉంటుందని శ్రీహరికోటలో నివాసం ఉంటున్న సుమారు 16 కాలనీ లను ఖాళీ చేపించి ఉమ్మడి నెల్లూరు తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఒక్కొక్కరికి 10 సెంట్లు నివాస స్థలము, 3 ఎకరాల సాగుభూమి ఇవ్వడం జరిగింది. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలోని నెమిలి మిట్ట అగ్రహారం గ్రామంలో నివాసానికి అనువుగా వుండే సర్వేనెంబర్ 305లో సుమారుగా 306 ప్లాట్‌లను శ్రీహరికోట లేబర్ కాలనీ నివాసులకు ఇవ్వడం జరిగింది. ఇచ్చిన ప్లాట్‌లలో గృహాములు నిర్మించుకునేందుకు వచ్చిన కాలనీవాసులను అక్కరపాక గ్రామస్తులు అడ్డుకొని నాటిన రాళ్లను పగులుగొట్టి, వచ్చిన వాళ్లపై దుర్భాషలాడి మీకు ఇక్కడ స్థలం లేదు, ఎవరు మీకు ఈ స్థలం ఇచ్చిందని మాపై గొడవలకు దిగుతున్నారని ఆర్డీవోకు తెలియపరిచారు. ఆర్డీవో మాట్లాడుతూ త్వరలో బాధితులను గుర్తించి న్యాయం చేస్తామని తెలిపారు. పై కార్యక్రమంలో సిపిఎం జిల్లా సెక్రెటరీ వందవాశు నాగరాజు, శ్రామిక మండల జిల్లా అధ్యక్షురాలు లక్ష్మమ్మ, మండల కార్యదర్శి లక్ష్మయ్య, పార్టీ కార్యదర్శి అల్లెయ్య, సిఐటియు అధ్యక్షులు సాంబశివయ్య, పార్టీ నాయకులు పద్మనాభం, కాలనీవాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# డ్రైనేజీ భూతంలో కాదులూరు చెరువు

### కంపెనీల నుండే వెలువడే వ్యర్థాలు నేరుగా కాదులూరు చెరువులోకి

### పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, అధికార యంత్రాంగం ఎక్కడ ?

### గత రెండు నెలల ముందు సర్పంచికి, పంచాయతీ కార్యదర్శికి తెలిపినా ఫలితం శూన్యం



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఫిబ్రవరి 17)**

తిరుపతి జిల్లా తడ మండలం ఏపీఐఐసీ పరిధిలో ఉన్న మాంబట్టు సెజ్‌లో ఉన్న కంపెనీలలోని వ్యర్థాలు, డ్రైనేజీ నీళ్లు నేరుగా కాదులూరు చెరువులోకి వదులుతున్నా అధికారులకు కానరావడం లేదా? కంపెనీలలోని వ్యర్థాలు, డ్రైనేజీ నీళ్లు చెరువులో కలిసిపోవడం వలన ఆ నీళ్లను తాగే పశువులు రోగాల బారిన పడటం, చెరువులో దిగిన వ్యక్తులకు చర్మ రోగాలు రావడం, చెరువు నీళ్లతో ఉతికిన బట్టలను వేసుకోవడం వలన ప్రజలు రకరకాల రోగాలు బారిన పడుతున్నామని ప్రజలు తెలియజేస్తున్నారు. అధికారులు గాని, గ్రామ సర్పంచ్ గాని స్పందించి కంపెనీల నుండే వెలువడే వ్యర్థాల నీళ్లు, డ్రైనేజీ నీళ్లు చెరువులో కలవకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

# ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి విరాళాలు ఇచ్చిన షంషూర్ బ్రదర్స్



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 17)**

కనిగిరి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి తన వంతు సహాయంగా షంషూర్ బ్రదర్స్ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతులకి 25000 ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారావ శ్రీనివాసులు, జిల్లా టిడిపి కార్యవర్గ సభ్యులు సయ్యద్ అమీర్ బాబు, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు కావేరి రసూల్, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించాలి

### రెవెన్యూ మంత్రికి విన్నపం

### ఏపీ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



**(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 17)**

కొండపి నియోజకవర్గంలో ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను త్వరితగతన పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కోరారు. ఈ మేరకు సీసీఎల్ఏ అడిషనల్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్‌కు నియోజకవర్గంలో భూ సమస్యలపై పరిష్కారం చూపాలని కోరుతూ సిఫార్సు చేయడం జరిగింది. ఈ మేరకు దామచర్ల సత్య మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని జరుగుమల్లి మరియు పొన్నలురు మండలాల్లో ఆర్ఎస్ఆర్ నందు యర్రకండ్రిక, గర్భకండ్రిక గా నమోదు కాబడిన భూములను తొలగించి రిజిస్టర్ చేసుకునే విధంగా మార్పు చేయలని విజ్ఞప్తి చెయ్యడం జరిగిందన్నారు. అలానే పొన్నలూరు మండలం లోని చెన్నిపాడు గ్రామంలో కనిపించకుండపోయిన రెవెన్యూ రికార్డుల గురించి ప్రజలు పడుతున్న ఇబ్బందులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సర్వీస్ ఇనాం భూములను 22 ఏ (1) (సీ) జాబితా నుండి తొలగించి, రైతులకు రిజిస్టర్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరునట్లు సత్య తెలిపారు. కొండపి నియోజకవర్గ భూ సమస్యల పరిష్కారం కోసం సీ.సీ.ఎల్. ఏ తగు చర్యలు నిమిత్తం ప్రకాశం జిల్లా కలెక్టర్ కు ఆదేశించడం పట్ల దామచర్ల సత్య రెవిన్యూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# రైతాంగాన్ని ఆదుకోవాలి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 17)**

రైతాంగాన్ని ఆదుకోవాలని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నర్సోజికి వినతిపత్రం ఇచ్చారు. మద్దతు ధర లేకుండా నష్టానికి రైతులు తమ పంటలను అమ్ముకుంటున్నారు. నెల్లూరు జిల్లాలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కానుంది. జిల్లా అధికారులు 11 లక్షలు మెట్రి క్ టన్నులు ధాన్యాన్ని మాత్రమే సేకరించాలని నిర్ణయించారు. అధికార అనధికారికంగా జిల్లాలో600000 ఎకరాలకు పైగా వరి సాగు బడి జరిగింది . సివిల్ సప్లైస్ వారు 350000 ఎకరాలలో మాత్రమే ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. గత రెండు మూడు సీజన్లలో బిపిటి 23000. కేఎన్ఎమ్ 24000 .ఆర్ఎన్ఆర్26000 రూపాయల చొప్పున పుట్టి ధాన్యాన్ని విక్రయించుకున్న రైతాంగంకు నేడు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదు . బిపిటి రకం 16 17 వేల మధ్య కెఎన్ఎమ్ 17 18 వేల మధ్య ఆర్ఎన్ఆర్ 18 బి18 1/2వేల రూపాయలకు విక్రయించుకుంటున్నారు. అధికారిక ఆయకట్టు ఐదు లక్షలు ఎకరాలు కు ఈ క్రాప్ నమోదై ఉంటే అందులో 3.5 లక్షలు ఎకరాలులో మాత్రమే ధాన్యం సేకరణ అమలవుతుంది. అనధికార ఆయకట్టు చెరువులు వాగులు బిపోరంబోకులు వంకలలో రైతులు సాగుచేసిన లక్ష ఎకరాలు ఈ క్రాప్‌లో నమోదు చేయడం లేదు . జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలలో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేసే అవకాశం లేనందున రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. నెల్లూరు జిల్లాలో రైతాంగం పంటను ఎండబెట్టుకునేందుకు ప్లాట్ ఫారం లో లేనందున దళారులకు గిట్టుబాటు ధర కంటే తక్కువ రేటుకు విక్రయించుకుంటున్నారు మిల్లర్ల వద్ద డ్రైయర్లు సదుపాయం ఉన్నందున మిల్లర్లను ప్రభుత్వం ఒప్పించి తేమ శాతం తో సంబంధం లేకుండా రైతాంగం నష్టపోకుండా విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి రమేష్ విజ్ఞప్తి చేశారు . గత టిడిపి ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి తలెత్తినప్పుడు అనధికారాయకట్టు రైతాంగం నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు. అలాంటి చర్యలను పునరుద్ధరించాలని మిడతల రమేష్ వ్యవసాయ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, అలీ రవి కుమార్ యాదవ్, కంచర్ల నారాయణ యాదవ్, సిహెచ్ కాలంగి సుబ్బారావు, నారాయణరావు, పి ప్రశాంత్‌లు పాల్గొన్నారు.



# స్వచ్ఛ పాఠశాలలు బాలల ఆరోగ్యానికి నిలయాలు

### చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 17)**

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని దేవాంగనగర్ ప్రభుత్వ ఉర్దూ పాఠశాల లో కనిగిరి పురపాలక సంఘం,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆవరణంలో,చుట్టు పక్కల ప్రాంతంలో శుభ్రం చేసి పిచ్చి చెట్లు తొలిగించారు. పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ స్వచ్ఛ పాఠశాలు బాలల ఆరోగ్యానికి నిలయాలు అని అన్నారు. పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత అని విద్యార్థి దశనుండే పరిసరాల పరిశుభ్రత పై అవగాహన పెంచుకోవడం వలన భవిష్యత్తులో మంచి వాతావరణంలో జీవిస్తారని అన్నారు. ఈ సందర్బంగా పిల్లలకు పరిసరాల పరిశుభ్రత,చేతులు కడుక్కోవడం, మంచి నీరు పొదుపుగా వాడడం,నీటి వినియోగం,భోజనానికి ముందు,తర్వాత చేతుల శుభ్రత పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలకు నీటి సౌకర్యం అడుగగా వెంటనే స్పందించిన చైర్మన్ సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియపరచి వెంటనే నీటి సౌకర్యం కల్పిస్తామని తెలియజేసారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దీవెన, ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, షహనాజ్, శానిటరీ సెక్రెటర్ కాశిరాజు, ఎనిమినిటీ సెక్రెటర్ షంషీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవకుమార్, విద్యార్థులు, స్వచ్ఛత అంబాసిడర్లు, తదితరులు పాల్గొన్నారు.







# పొగాకు బ్యారన్లు దగ్ధం

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 17)**



పొగాకు కాల్పు సమయంలో కర్రలు జారిపడి రెండు పొగాకు బ్యారన్‌లు దగ్ధమైన సంఘటన మండలంలోని వెంకుపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే వెంకుపాలెం గ్రామానికి చెందిన మాదాల ప్రసాద్, బత్తిన కొండయ్య, పర్వతనేని రవికుమార్, పర్వతనేని వెంకట్రావు లకు సంబంధించిన రెండు బ్యారాన్ లు



దగ్ధమయ్యాయి. జరిగిన సంఘటనపై గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు స్పందించి మంటలు ఆర్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో సుమారు ఎనిమిది లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం.

# మాస్టర్ ప్లాన్ ప్రకారం సంతపేట ఆదర్శ పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి

### నగరంలోని అన్ని మున్సిపల్ పాఠశాలలు, పార్కుల్లో క్రీడా పరికరాలు, జిమ్ ఎక్విప్మెంట్

### రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 17)**

ఒక మాస్టర్ ప్లాన్ ప్రకారం సంతపేటలోని నగరపాలక సంస్థ ఆదర్శ పాఠశాల (గుంటబడి) క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. సోమవారం ఉదయం సంతపేటలోని ఆదర్శ పాఠశాల క్రీడామైదానాన్ని అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల ఈ పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని సందర్శించినప్పుడు రాళ్లురాప్పలు, ముళ్లపొదలతో నిండి వుందని, దీనిని పరిశుభ్రంగా తయారుచేయమని అధికారులకు ఆదేశాలిచ్చి చెత్తాచెదారం తొలగించి చదును చేయించినట్లు చెప్పారు. ఇది చాలా పెద్ద మైదానమని, ఈ మైదానం అభివృద్ధి కోసం ఒక కన్సల్టెన్సీ తో మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయించామని, ఆ మేరకు విడతల వారీగా క్రీడాపరికరాలను ఏర్పాటు చేసి అందరికి ఉపయోగపడేలా తయారుచేస్తామని చెప్పారు. ఆరు నెలల నుంచి ఒక సంవత్సరంలోపు ఈ మైదానంలో వాకింగ్ ట్రాక్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, నెట్ క్రికెట్ కోర్టులను ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. తొలివిడతగా కాంపౌండ్‌వాల్, వాకింగ్ ట్రాక్, బాస్కెట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేసేలా అధికారులకు ఆదేశిలిచ్చినట్లు చెప్పారు. నగరంలోని అన్ని మున్సిపల్ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమై పాఠశాలల సమస్యలపై చర్చించామని, వారి సూచించిన సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. నగరంలోని 54 డివిజన్లలోని పార్కులు, మున్సిపల్ పాఠశాలల్లో క్రీడాపరికరాలు, జిమ్ ఎక్విప్‌మెంటు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే మూడు నెలల్లో ఇవన్నీ అందుబాటులోకి వస్తాయన్నారు. అన్ని మున్సిపల్ పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని యాక్ట్ యాజమాన్యాన్ని కోరగా, వారు సానుకూలంగా స్పందించారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నగరంలోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా ఎవరూ కూడా ఈ మైదానం అభివృద్ధిపై దృష్టి సారించలేదని, మంత్రి నారాయణ చొరవతో ఈ పాఠశాల మైదానం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయని వారు హర్షం వ్యక్తం చేశారు.







# ఇంటి స్థలాల కోసం విన్నపం



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 17)**

కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామానికి చెందిన 40 ఎస్టి కుటుంబాలకు ఇళ్ల స్థలాల మంజూరు చేసి ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఒంగోలు పార్లమెంట్ ఎస్టి సెల్ ప్రధాన కార్యదర్శి రాపూరి కోటేశ్వరమ్మ సోమవారం మండల తహసిల్దార్ వి. పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కోటేశ్వరమ్మ మాట్లాడుతూ నిలువ నీడ లేక ఒకే కుటుంబంలో రెండు మూడు జంటలు ఒకే ఇంటిలో నివసిస్తూ ఇబ్బందులు పడుతు న్నామని గతంలో ఇచ్చిన హామీ ప్రకారం తమ 40 ఎస్టీ కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు వాగుని ఆనుకొని ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటి పట్టాలు రద్దుచేసి మరొక చోట ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. రెక్కడితే గాని డొక్కాడని పేద కుటుంబాలకు అండగా నిలవాలని తహసీల్దార్ ను కోరినట్లు చెప్పారు. దీనిపై తహసిల్దార్ స్పందిస్తూ ఇంటి పట్టాలకు అవసరమైన స్థలాలను గుర్తించి సాధ్యసాధ్యాలను పరిశీలించి తగు న్యాయం చేస్తామని తెలిపినట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కుటుంబాల వారు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లా హాస్పిటల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 17)

మార్కాపురం జిల్లా హాస్పిటల్‌ను సోమవారం సాయంత్రం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మొదటిగా ఆస్పత్రిలో స్టోర్ రూమ్‌లో వెంటిలేటర్‌లు నిరుపయోగంగా పడేసి ఉండటంతో హాస్పిటల్ సిబ్బంది పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఐసీయూ కు తాళం వేసి ఉండటంతో దానిని ఓపెన్ చేయించి ఐసియు ఎందుకు వాడడం లేదో ఆరా తీశారు. ఐసీయూలో ఏసీల కొరత ఉండటంతో త్వరలోనే ఏసీలు అందజేస్తానని తిరిగి ఐసీయూని ప్రారంభిస్తే రోగులకు ఉపయోగంగా ఉంటుందని సిబ్బందికి తెలియజేశారు. అనంతరం చిల్డ్రన్ వార్డ్‌ను తనిఖీ చేశారు. డయాలసిస్ కేంద్రానికి వెళ్లి ఆసుపత్రి సిబ్బంది అందిస్తున్న సేవలపై పేషెంట్లను ఆరా తీశారు. నిన్న ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలను మార్చురీలో పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.







## 21న మామిడి రైతులకు రైతు శిక్షణ కార్యక్రమం

మండల ఉద్యాన అధికారి బి జ్యోతి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 17)

ఫిబ్రవరి 21 శుక్రవారం కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం వద్ద మామిడి రైతులకు ఉద్యానశాఖ -నెల్లూరు వారు రైతు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలే కాకుండా పెరియవరం రీసెర్చ్ స్టేషన్ నుండి శాస్త్ర వేత్త శ్రీనివాసల రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్తలు కూడా రానున్నారు. మండలంలోని అందరూ మామిడి రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు. పాల్గొన్న రైతులకు మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఉలవపాడు మండల పరిధిలోనీ మామిడి రైతులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## కరేడు రామకృష్ణాపురం

గిరిజనుల స్మశాన స్థలంలో ఆక్రమణలను తొలగించాలి

సిపిఎం ఆధ్వర్యంలో వినతి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 17)

కరేడు రామకృష్ణాపురం గిరిజన కాలనీ 1979లో ఏర్పడిందని, కాలనీ ఏర్పడిన సందర్భంలో అప్పటి ప్రభుత్వ అధికారులు కాలనీకి దగ్గరలోనే రాళ్లకట్ట పొలంలో 2 ఎకరాల స్థలాన్ని స్మశానానికి కేటాయించారని సిపిఎం ఉలవపాడు మండల సీనియర్ నాయకురాలు పొన్నం రామలక్ష్మమ్మ తెలిపారు. ప్రస్తుతం ఆ స్మశాన స్థలాన్ని పర్ఫెక్ట్ శ్రీనివాస రెడ్డి, బ్రహ్మయ్య అనే రైతులు ఆక్రమించి జామాయిల్ మొక్కలు వేశారని సోమవారం కరేడు-2 సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ తిరుపతయ్యకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం కార్యదర్శి భాస్కర్ రావుతో మాట్లాడారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని స్మశాన స్థలం ఆక్రమించి జామాయిల్ వేసిన రైతులపై చర్యలు తీసుకొని, ఆక్రమణలను తొలగించి,సర్వే చేసి తిరిగి ఆ స్థలాన్ని గిరిజనులకు అప్పజెప్పాలని సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ కోరారు. ఈ విషయంపై రామకృష్ణాపురం గిరిజనులు పలు సందర్భాలలో సచివాలయ కార్యదర్శికి, ఉలవపాడు మండల తహసీల్దార్ కి తెలిపినప్పటికీ,ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు లేవని పేర్కొన్నారు. అధికారులు జోక్యం చేసుకొని ఆక్రమణలను తొలగించక పోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఈరోజు ఆక్రమణకు గురైన కరేడు రామకృష్ణాపురం గిరిజనుల స్మశాన స్థలాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు.గిరిజన సంక్షేమ శాఖాఅధికారులకు విషయాన్ని తెలియజేసి ఆక్రమణదారుల పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయిస్తామని పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఎం సీనియర్ నాయకురాలు పొన్నం రామలక్ష్మమ్మ తోపాటు సిపిఎం రామకృష్ణపురం శాఖా కార్యదర్శులు కత్తి సుజాత, చేవూరి లోకేశ్వరరావు, సిపిఎం నాయకులు మల్లవరపు లలితమ్మ, యాటగిరి సాయమ్మ, చేవూరి రుక్మినమ్మ, కత్తి వెంకాయమ్మ, కత్తి రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ ప్రభుత్వంతోనే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి - వినుకొండ సుబ్రహ్మణ్యం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 17)

నాయీ బ్రాహ్మణుల సంక్షేమం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వినుకొండ సుబ్రహ్మణ్యం తెలియజేశారు. సోమవారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళుతూ మార్గమధ్యంలోని కనిగిరిలో నాయి బ్రాహ్మణ సంఘ కార్యాలయాన్ని సందర్శించి సంఘీయులను కలిశారు. కనిగిరి టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు చింతలపూడి తిరుపాలు, నాయి చైతన్య పరిషత్ జిల్లా అధ్యక్షులు గోపిశెట్టి బాల చెన్నారావు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు ఈ సందర్భంగా వినుకొండ సుబ్రహ్మణ్యంను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వినుకొండ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించిన నాటి నుంచి తాను పార్టీలో కొనసాగుతూ నాయి బ్రాహ్మణుల అభ్యున్నతికి తన వంతు కృషి చేయడం జరిగిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేశారు. ఎన్టీఆర్ , ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. నాయీ బ్రాహ్మణుల జీవనాధారమైన క్షవర వృత్తిలోకి ఇతరులు రావడం విచారకరమని అన్నారు. క్షవర వృత్తిలోకి ఇతరులు రాకుండా నాయి బ్రాహ్మణులకు పేటెంట్ హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. గీత కార్మికులకు మద్యం దుకాణాలు పెట్టుకునేలా అవకాశం కల్పించి ఉపాధి చూపించడం జరిగిందని అదేవిధంగా నాయి బ్రాహ్మణులకు కూడా ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక దృష్టి ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాధచాలని కోరారు. నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించేలా ఆర్థిక అభివృద్ధి సాధించేలా చైతన్యవంతం కావాలని సూచించారు. నాయి బ్రాహ్మణులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు డాక్టర్ పచ్చవ చంద్రశేఖర్, రాచర్ల వెంకటనారాయణ, పాలూరి సత్యం, చింతలపూడి వాసుదేవరావు, ఈదర రవికుమార్, చింతలపూడి కరుణాసాగర్, ఈదర రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ మోసాల పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజా ఫిర్యాదుల పై తక్షణ చర్యలు చేపట్టి

బాధితుల పక్షాన అండగా నిలవాలి

ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్

గ్రీవెన్స్‌కు 81 ఫిర్యాదులు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 17)

ప్రజా ఫిర్యాదులను పరిష్కారించుటకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ,పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా నలువైపులా నుండి విచ్చేసిన ప్రజలు వారి ఫిర్యాదుల గురించి జిల్లా ఎస్పీ ,పోలీస్ అధికారులుకు విన్నవించుకున్నారు. ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అందిన ఆయా ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, చీటింగ్, జాబ్ ఫ్రాడ్, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి ప్రజా ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సీఐ యన్ శ్రీకాంత్ బాబు, సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐలు రజియా సుల్తాన్, ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

గ్రాట్యుటీ అమలు చేయాలి

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఓ ఇవ్వాలి

కొండేపి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు ధర్నా



(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 17)

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఓ ఇవ్వాలని కోరుతూ సోమవారం కొండేపి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై. సత్యవతి, అంగన్వాడి యూనియన్ నాయకులు పాల్గొన్నారు. మన రాష్ట్రంలో పేదగర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు, అనేక సేవలు అందిస్తున్నారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు రకరకాల పెట్టుబడులు పెట్టి సెంటర్లు నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదు. అంగన్వాడీలకి వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం కొరకు 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించాము. సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు 2024 జూలై లో వేతనాలు పెంచుతాము, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తానని మినిట్స్ ఇచ్చారు. అయినా నేటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదని, సంక్షేమ పథకాలకి కూడా అంగన్వాడీ లు నోచుకోలేదు అని ఆమె అన్నారు, కొండేపి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎం పోలమ్మ తల్లికి వంధనం అంగన్వాడీలకి కూడా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు మండల లీడర్స్ పద్మ, రామలక్ష్మి, మర్రిపూడి మండలం నుంచి హైమావతి, వెంకటరమణ, ప్రాజెక్ట్ వైజ్‌గా అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.